ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL/26/A2455
షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

PL.NO.IR/RNP/SV/26/2026
సంపుటి : 01 సంచిక : 98
శుక్రవారం 07 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## రూ.9.5 లక్షల కోట్లు.. వెనక్కి ఇచ్చేసిన ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 06)
ప్రపంచ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దాంతో తీర్పునకు ముందువరకు వసూలు చేసిన సుంకాలను యూఎస్ ప్రభుత్వం రిఫండ్ చేస్తోంది. ఇప్పటివరకు 100 బిలియన్ డాలర్ల (రూ.9.5 లక్షలకోట్లకు పైగా) మేర సొమ్మును దిగుమతిదారులకు వెనక్కి ఇచ్చేసింది.రెండోదఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ ఆర్థిక అధికారాల చట్టాన్ని ట్రంప్ ప్రయోగించారు. దానికింద పలు దేశాలపై ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ టారిఫ్‌ల రూపంలో 166 బిలియన్ల డాలర్లను ట్రంప్ యంత్రాంగం వసూలు చేసింది. అయితే, ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆ సుంకాలు కట్టిన దిగుమతిదారులకు 100 బిలియన్ల డాలర్లను వాపసు ఇచ్చింది. కోర్టు ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ట్రంప్ యంత్రాంగం వెల్లడించింది.అధ్యక్షుడు ట్రంప్ తన పరిమితులను

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

వైసీపీ నేతలకు బొండా ఉమా తీవ్ర హెచ్చరిక



విజయవాడలో వైసీపీ నేతల దీక్షపై బొండా ఉమా ఫైర్
డీఎస్సీపై చర్చకు రమ్మంటే పారిపోయారని ఎద్దేవా

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
వెల్లంపల్లి ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తామని హెచ్చరిక
ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీవ్రస్థాయిలో హెచ్చరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు చేపట్టిన నిరాహార దీక్ష వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఘాటుగా స్పందించారు. డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడంపై

## పరామర్శల పేరిట జగన్ బలప్రదర్శన.. ఏం సందేశమిస్తున్నారు?: మంత్రి అనిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)



వైకాపా అధ్యక్షుడు జగన్ బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకాలు జరుగుతున్నాయని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టడమే ఆయన పని అని విమర్శించారు. పరామర్శల పేరుతో బలప్రదర్శన చేస్తూ ప్రజలకు ఏం సందేశమిస్తున్నారని జగన్‌ను ప్రశ్నించారు. బాధితులను కాకుండా నిందితులను పరామర్శించడమేంటని నిలదీశారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. జగన్ పర్యటనల్లోని ఘటనలకు సంబంధించిన వీడియోలను

# చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక..

## ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం



- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల ప్రయోజనం
- ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛన్లతో పాటు పలు సంక్షేమ పథకాల అమలు
- చీరాల పర్యటనలో నేతన్నలతో ముఖాముఖి భేటీ కానున్న సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి వృత్తిని పరిరక్షించేందుకు ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో 'నేతన్న సేవలో' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లు జమ కానున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వనప్పటికీ, చేనేత వృత్తిని, దాని వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని

## పొగాకు రైతులకు అండగా నిలిచిందెవరో చర్చకు సిద్ధమా?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్
పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారి.. వారిని ఆదుకున్నది తెదేపా నాయకత్వంలోని ప్రభుత్వమేనని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వైకాపా అధ్యక్షుడు జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే.. వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'రైతులు గత ప్రభుత్వ పనితీరును, కూటమి ప్రభుత్వం

## విమానాల ఇంధనంలో ఇథనాల్.. కొట్టిపారేసిన రామ్మోహన్ నాయుడు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
విమానాల ఇంధనం "ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్" లో ఇథనాల్ కలిపే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. విమాన భద్రతపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం వల్ల ప్రయాణికుల్లో అనవసరమైన ఆందోళన నెలకొంటు ందని చెప్పారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి: సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులతో పలు కీలక అంశాలపై ఆయన చర్చించారు. అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకునేందుకు కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు యత్నిస్తున్నారని.. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడికక్కడ ఆస్తులను వేలం వేసి బాధితులకు త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన 2047-వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో స్వాతంత్ర్య వేడుకలను స్వర్ణాంధ్ర





## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్..

- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో



## బీసీ రక్షణ బిల్లుకు తుది రూపు ఇస్తున్నాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
'వెనుకబడిన వర్గాలకు సామాజిక గౌరవం, రక్షణ కల్పించడమే లక్ష్యంగా తీసుకొస్తున్న బీసీ రక్షణ బిల్లుకు తుది రూపు ఇస్తున్నాం. ఇప్పటికే దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నాం. త్వరలో బీసీ సంఘాల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటాం. ప్రాంతీయ, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాలను సేకరిస్తాం. తర్వాత ముసాయిదా రక్షణ బిల్లును జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తాం. అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ప్రవేశపెడతాం' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. బీసీ ముసాయిదా రక్షణ బిల్లు కూర్పుపై ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులతో బుధవారం విజయవాడలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోడించాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలకు రాజకీయ, సామాజిక గుర్తింపే లక్ష్యంగా సీఎం చంద్రబాబు.. బీసీ రక్షణ బిల్లు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు.'బీసీలకు ఎన్టీఆర్ రిజర్వేషన్ కల్పిస్తే, చంద్రబాబు దాన్ని 27 శాతానికి పెంచారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక బీసీలపై కక్షగట్టి రిజర్వేషన్లు తగ్గించింది.

## వైసీపీ ప్రాజెక్టుల యాత్ర ఒక రాజకీయ నాటకం.. చంద్రబాబుపై అవాకులు పేలితే సహించం: కాలవ శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరుతో వైసీపీ నాయకులు సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని, ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ఏ పనీ చేయమని, చేసేవాళ్లను చూస్తే కడుపుమంటతో విమర్శిస్తామని చెప్పడానికి వైసీపీ నేతల తీరే నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు.



## 6,330 ఎకరాల అగ్రిగోల్డ్ భూములు వేలానికి సిద్ధం

### ఈ నెల 11న విధివిధానాలు ఖరారు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 06)
అగ్రిగోల్డ్ ఆస్తుల్లో 6,330 ఎకరాలు వేలం ద్వారా విక్రయించి.. ఆ డబ్బులు బాధితులకు అందజేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అగ్రిగోల్డ్‌కు దేశవ్యాప్తంగా 23,430 ఎకరాలు ఉండగా, అందులో ఏపీలోనే 20,450 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామని, వీటిలో 14,304 ఎకరాలను సీఐడీ ప్రభుత్వానికి అప్పగించినట్లు చెప్పారు. వీటిలో 6,330 ఎకరాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈనెల 11న ప్రభుత్వ



## హరితాంధ్రకు కంభం నుంచి హరితహారం

### చెరువు కట్ట పై సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో మొక్కల నాటకం







(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 6)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్కాపురం జిల్లా కంభం చెరువు కట్ట పై గురువారం మొక్కలు నాటారు. కంభం సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం అనంతరం హరితాంధ్ర విజయవంతం కావాలని ప్రతిజ్ఞ చేశారు.

## దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశం పై అవగాహన ర్యాలీ

### మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యలు త్వరితగతిన పరిష్కారం - జడ్జి బి రూపశ్రీ




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 6)

దేశం కోసం మధ్యవర్తిత్వం వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి రూపశ్రీ ఆధ్వర్యంలో కనిగిరి కోర్టు నుండి పామూరు బస్టాండ్ వరకు మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాల పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు డోర్ టు డోర్, బస్టాండ్, ప్రధాన కూడలిలలో ప్రజలకు కరపత్రాలు పంపిణి చేసి అవగాహన కలిగించారన్నారు. కోర్టు ప్రాంగణం నందు మధ్యవర్తిత్వం యొక్క ప్రయోజనాల పై స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు ప్రతి రోజు అవగాహన కలిపిస్తున్నామని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారానే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయ సహాయం కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి, సభ్యులు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక..

అమలు చేస్తోంది. ఈ కొత్త పథకంతో పాటు ఇప్పటికే ప్రభుత్వం చేనేత రంగానికి అనేక విధాలుగా మద్దతు అందిస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. అంతేకాకుండా, చేనేతల వృద్ధాప్య పింఛన్ వయసును 50 ఏళ్లకు తగ్గించి, రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మందికి నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ల కోసం ఏటా రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసా వారి జీవనోపాధికి అండగా నిలుస్తోంది. చేనేత రంగాన్ని మౌలికంగా బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం దీర్ఘకాలిక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాజధాని అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల భారీ పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం ఈ రంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు చీరాలలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, వేటపాలెం మండలం కొత్తపేటకు చేరుకుంటారు. ఉదయం 11:05 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:35 గంటలకు జాండ్రపేటలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో నేతన్నలతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4:10 గంటలకు కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## రూ.9.5 లక్షల కోట్లు.. వెనక్కి ఇచ్చేసిన ట్రంప్

దాటి ఈ సుంకాలను విధించారని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అధిక సుంకాల కింద కంపెనీల నుంచి వసూలుచేసిన సొమ్ము వాపసు చేయాల్సిందేనని నాడు న్యాయస్థానం స్పష్టం చేసింది. అధిక దిగుమతి సుంకాల విధింపు వల్ల అప్పట్లో ప్రతిరోజూ రూ.4,538 కోట్ల చొప్పున అమెరికా ఖజానాకు వచ్చి చేరాయి. కాగా.. కోర్టు తీర్పుతో చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి కీలకమైన ఆసియా దేశాలకు భారీ ఊరట లభించింది.

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

మండిపడిన ఆయన... అసలు అక్రమాలపై చర్చకు రమ్మంటే వైసీపీ నేతలు పారిపోయారని ఎద్దేవా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా రోడ్డుపై కూర్చుని చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. “శాంతియుతంగా నిరసన తెలపాలనుకుంటే ధర్నా చౌక్‌లో చేసుకోవాలి. అంతేకానీ రోడ్డుపై కూర్చుని మా నాయకులపై దాడి చేస్తామంటే చూస్తూ ఊరుకోం. తోలుతీస్తాం. వెల్లంపల్లి శ్రీనివాస్ ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తాం” అని హెచ్చరించారు. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ఇకపై సహించేది లేదని, ప్రతిఘటన తప్పదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## పరామర్శల పేరిట జగన్ బలప్రదర్శన.. ఏం సందేశమిస్తున్నారు?: మంత్రి అనిత

ఈ సందర్భంగా మంత్రి ప్రదర్శించారు. “గొడ్డలి పార్టీ నేతలు బాధ్యతాయుతమైన విమర్శలు చేయాలి. బెట్టింగ్‌లో నష్టపోయి మరణించిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఆయన కారు కింద ఓ వ్యక్తి పడితే పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అంబులెన్స్‌కూ దారి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ కార్యకర్తలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జగన్ పరామర్శల్లో మహిళలపైనా దాడులు చేస్తున్నారు. వైకాపా నేతలు పోలీసులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పరామర్శల పేరిట జగన్ చేసిన బలప్రదర్శనల కారణంగా ముగ్గురు చనిపోయారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని అయినా జరిగిందా?” అని అనిత ప్రశ్నించారు.

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్..

రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

## అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి: సీఎం చంద్రబాబు

విజన్-2047 ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని సమర్థంగా వినియోగించుకుంటూ తాగునీటి ఎద్దడిని పూర్తిగా అధిగమించాలని, ఆ తర్వాత ప్రాధాన్యతగా పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

**17 నుంచి అసెంబ్లీ సమావేశాలు**

ఈనెల 17 నుంచి 20 మధ్య నాలుగురోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. గత పాలకులు దిశ చట్టం పేరుతో ప్రజలను మోసగించి, కేవలం ఉత్తుత్తి పోలీస్ స్టేషన్లు, వాహనాలతో హంగామా చేయడం తప్ప మహిళల భద్రతకు తీసుకున్న చర్యలు శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళల భద్రత కోసం సమగ్రంగా చట్టసవరణ చేసి, మరింత పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. ఈ నెల చివర్లోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి నల్లమల సాగర్‌కు నీరందిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ పనితీరు డిసెంబర్ లేదా జనవరిలో ప్రారంభమవుతుందని సీఎం వెల్లడించారు. గిరిజనులు తమ సంప్రదాయ నృత్యంతో గిన్నిస్ రికార్డు సృష్టించడం అభినందనీయమని చంద్రబాబు కొనియాడారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభ ఘట్టాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకున్నారని, అక్కడ సముద్రం మీదుగా విమానాలు వచ్చి రన్ వేపై ల్యాండ్ అవడం ప్రయాణికులకు గొప్ప అనుభూతినిస్తుందని చెప్పారు.

## విమానాల ఇంధనంలో ఇథనాల్.. కొట్టిపారేసిన రామ్మోహన్ నాయుడు

కేంద్రం ఏటీఎఫ్‌లో ఇథనాల్ కలపాలని యోచిస్తోందని, అది విమాన భద్రతకు ముప్పుగా మారొచ్చని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు పెట్టడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ రెండూ పూర్తిగా వేర్వేరు ఇంధనాలని వివరించారు. ఎస్ఏఎఫ్‌కు అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భద్రతా ప్రమాణాలు, పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే దానిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

## బీసీ రక్షణ బిల్లుకు తుది రూపు ఇస్తున్నాం

బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచేలా కృషి చేస్తాం’ అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎన్ఎండీ ఫరూక్, ప్రభుత్వ విప్‌లు కాలవ శ్రీనివాసులు, బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, గుమ్మనూరు జయరాం, గళ్లా మాధవి, కాగిత కృష్ణప్రసాద్, గౌతు శిరీష, చదలవాడ అరవిందబాబు, కూన రవికుమార్, కందికుంట వెంకట ప్రసాద్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రాజెక్టుల యాత్ర ఒక రాజకీయ నాటకం.. చంద్రబాబుపై అవాకులు పేలితే సహించం: కాలవ శ్రీనివాసులు

ఐదేళ్లలో మీరు చేసిందేమిటి?

గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి, తాను రాయలసీమ బిడ్డనని చెప్పుకుంటూనే ఆ ప్రాంత భవిష్యత్తును నాశనం చేశారని కాలవ ఆరోపించారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో తాము రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తే, జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు జీవనాడి అయిన హంద్రీ-నీవా ప్రాజెక్టుకు కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే తమ ప్రభుత్వం రాయలసీమ ప్రాజెక్టులపై ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేసిందని, ఇది సీమ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని అన్నారు. ఒక్క హంద్రీ-నీవా పైనే గత ఏడాదిలో రూ.3,870 కోట్లు వెచ్చించామని వివరించారు.

## 6,330 ఎకరాల అగ్రిగోల్డ్ భూములు వేలానికి సిద్ధం

ప్రధాన కార్యదర్శితో జరిగే సమావేశంలో వేలానికి సంబంధించిన విధివిధానాలు ఖరారు చేస్తామని, సెప్టెంబరు 15 నుంచి విడతల వారీగా భూముల వేలం ప్రక్రియ ఆరంభిస్తామని పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ సమస్యపై ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం బుధవారం సచివాలయంలో భేటీ అయింది. మంత్రులు అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొనగా, మంత్రి పయ్యావుల కేశవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనంతరం అనిత, సత్యప్రసాద్‌తో కలిసి నాదెండ్ల మనోహర్ విలేకరులతో మాట్లాడారు.

**ఎక్కువ ప్లాట్లు ఉన్నట్లుగా చూపించి మోసం**

‘అగ్రిగోల్డ్‌లో ఏజెంట్ల ద్వారా.. రూ.6380 కోట్లు డిపాజిట్లుగా సేకరించారు. ఇందులో మన రాష్ట్రానికి చెందినవే రూ.3,944 కోట్లు ఉన్నాయి. 18,57,290 ప్లాట్లు ఉన్నట్లు చూపించి, డిపాజిట్లు సేకరించారు. వీటిపై ఆడిట్ నిర్వహిస్తే.. కేవలం 5,76,589 ప్లాట్లే ఉన్నాయి. నిర్దేశిత గడువులోపు బాధితులకు న్యాయం చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందులో ప్రతి అంశం ప్రజలకు తెలిసేలా ప్రత్యేక వెబ్‌సైట్, డ్యాష్‌బోర్డు అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అగ్రిగోల్డ్ భూముల్లో పెంచిన ఎర్రచందనం వేలానికి నోడల్ అధికారిని నియమించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరాలని నిర్ణయించాం’ అని మనోహర్ తెలిపారు.

**ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక కేంద్రాలు**

‘తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఏజెంట్లు, బాధితులు బాండ్లు అందజేసేలా అక్కడ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నాం. 2015, మార్చి ఒకటి నాటికి ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నవాళ్లు, ఆ డాక్యుమెంట్లు సీఐడీ రీజనల్ కార్యాలయంలో అందజేస్తే.. వాటిని 22ఎ జాబితా నుంచి తొలగించి, ఫ్రీహోల్డ్ చేసేలా చూస్తాం. అగ్రిగోల్డ్ కేసుల కోసం ప్రత్యేక కోర్టు సిద్ధం చేశాం. ఆగస్టు 15 నాటికి దీనికి న్యాయాధికారిని నియమించాలని హైకోర్టు సీజేకి విజ్ఞప్తి చేస్తున్నాం’ అని మంత్రి మనోహర్ తెలిపారు.

## పొగాకు రైతులకు అండగా నిలిచిందెవరో చర్చకు సిద్ధమా?

అందిస్తున్న సహాయాన్ని పోల్చి చూడాలి. ఎవరు రైతులను గాలికి వదిలేశారో, ఎవరు కష్టకాలంలో అండగా నిలిచారో తెలుస్తుంది’ అని పేర్కొన్నారు. పొగాకు రైతుల సంక్షేమంపై జగన్ చేసే ఆరోపణలన్నీ అవాస్తవమని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పలు అంశాలను అచ్చెన్నాయుడు వివరించారు.

**పొగాకు రైతుల్ని మేం ఆదుకున్నాం.. మీరు వదిలేశారు**

2014-15 సంవత్సరంలో ధరలు పడిపోతే కిలోకి రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించాం. పొగాకు వాణిజ్య పంట అయినా రైతులు నష్టపోకూడదని చరిత్రలోనే కీలక నిర్ణయం తీసుకున్నాం. వైకాపా ప్రభుత్వ హయాంలో 2019 సంవత్సరంలో 124 మిలియన్ కిలోల ఉత్పత్తి అయింది. ధర కిలో రూ.121-123 మధ్యకు పడిపోయింది. కేవలం 11.8 మిలియన్ కిలోలు కొనుగోలు చేసి.. మిగిలిన రైతుల్ని వదిలేశారు. తర్వాత సంవత్సరంలో 128 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చింది. ధర కిలో రూ.123కి పడిపోయింది. అయినా ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు అదనపు ఆర్థిక సాయమూ ఇవ్వలేదు.

## 42 మంది లబ్ధిదారులకు రూ.32,76,340 లక్షల సీఎం సహాయ నిధి

### చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

సంతనూతలపాడు నియోజకవర్గంలోని 42 మంది లబ్ధిదారులకు రూ.32,76,340 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ గురువారం పంపిణీ చేశారు. నగరంలోని మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు సమీపంలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అవసరమైన సమయంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విశేషంగా సహకరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజాసేవే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.









ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ **వెలుగు**

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

07.08.26 శుక్రవారం


# 10న జైల్ భరో

- కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ కేంద్రంగా ఉన్న
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులకు
- లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు సీటు ప్లస్
- 50 పర్సెంట్ మద్దతు ధరను నిర్ణయించి ప్రభుత్వమే సేకరించాలి
- పొగాకు రైతుల పాలిట యమధర్మరాజుగా మారిన కూటమి ముఖ్యమంత్రి
- ధరల సమీక్ష చేసిన ప్రతిసారి గణనీయంగా పడిపోతున్న పొగాకు ధరలు
- దీని వెనుక ఉన్న మర్మం ఏంటో ముఖ్యమంత్రి బహిర్గతం చేయాలి
- పొగాకు వేలం కేంద్రం నాయకులు అని చెప్పుకునే వారు
- ముఖ్యమంత్రి మార్చుకుంటున్న నిర్ణయాలను బలపరచటం
- కార్పొరేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం కాదా
- రైతులు ఎన్నుకోని వేలం కేంద్రం నాయకులు పాతుకుపోయి
- ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు
- సంయుక్త కిసాన్ మోర్చా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక, కిసాన్ మజ్దూర్ సంఘ్, కాక్రోచ్ జనతా పార్టీ, జెన్‌జి, విద్యార్థి విభాగ బాధ్యులు, ఇచ్చిన పిలుపుమేరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021 డిసెంబర్ 9వ తేదీన కేంద్ర సంయుక్త కిసాన్ మోర్చా నాయకులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడానికి నిరసనగా ఈ నెల 10వ తేదీన జిల్లావ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిభవన్ లో నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో రంగారావు మాట్లాడుతూ 84వ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ జైల్ భరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో ఒంగోలు తో పాటుగా, కందుకూరు, కొండపి, సంతనూతలపాడు, అద్దంకి కేంద్రాలుగా ఈ జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, యూరప్, న్యూజిలాండ్ లతో చేసుకున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లన్నీ రద్దు చేయాలని ప్రధానమైన డిమాండ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ను అనుసరించి సీటు ప్లస్ 50 ప్రకారం పంటలకు మద్దతు ధర నిర్ణయించి, ప్రభుత్వమే సేకరించాలని, ఒక పర్యాయం దేశంలోని రైతాంగ అప్పులన్నీ రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న, హక్కులను, చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, తగిన నిధులు కేటాయించాలని, పనులను పట్టణ ప్రాంతానికి కూడా విస్తరింప చేయాలని, విద్యుత్ చట్టము, విత్తన చట్టం, నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్ సవరణలు రద్దు చేయాలని, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, జాతీయ సహకార విధానం రద్దు చేయాలని ఇంకా పలు అంశాలపై ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఒంగోలు ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో వర్జినియా పొగాకు రైతులకు మార్కెటింగ్లో తీవ్ర సంక్షోభం ఏర్పడిందన్నారు. గత మూడు సంవత్సరాలతో పోల్చుకుంటే కార్పొరేట్ పొగాకు కొనుగోలు దారులు రైతుల నుండి పొగాకును నామమాత్రపు ధరలతో, మందకోడిగా కొనుగోలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై సంయుక్త కిసాన్ మోర్చా జెండా కింద రైతులు జూన్ నెల నుండి పలు రూపాయలలో ఆందోళనలు చేపడుతున్నారన్నారు. జూన్ నెలలో చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీకి ఒకరోజు ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ రకమైన పొగాకునైన కిలోకు రూ. 200 కు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని గంభీరమైన ప్రకటన చేశారన్నారు. ఈ ప్రకటన రైతులకు మేలు చేసేందుకా, లేక రైతు ఉద్యమాన్ని నీరుగాలిచేందుకా ముఖ్యమంత్రి తెలపాలని డిమాండ్ చేశారు. జూన్ 18న కిలోకు రూ. 200 కు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ప్రకటించిన ముఖ్యమంత్రే, జూలై 8వ తేదీన మరింత గట్టిగా ప్రకటించారన్నారు. అయితే అవేమి అమలు కాలేదన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేయని కార్పొరేట్ వ్యాపారులపై ఎటువంటి చర్యలు లేవన్నారు. దీంతో సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కొనుగోలుకు రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థల వచ్చే కొనుగోలు చేయించాలని, సరా సరి ధర క్వింటాకు రూ. 25 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 29న జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమానికి పిలుపునిచ్చింది అన్నారు. దీంతో జూన్ 28వ తేదీన ముఖ్యమంత్రి సమీక్ష పేరుతో జూన్ 18, జూలై 8వ తేదీల సమీక్షలకు భిన్నమైన పద్ధతులలో ప్రకటన చేసి జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమాన్ని నీరుకార్చాలని అని చూశారన్నారు. గ్రేట్ రకం పొగాకు కిలోకు రూ.230, మీడియం రకం పొగాకు కు రూ. 190, లో గ్రేడ్ పొగాకు కిలో కు రూ.110 అనే పేరు చెప్పటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలలో వ్యత్యాసానికి కేజీకి రూ. 20 సహాయం చేస్తామని చెప్పడం, ఎవరి ప్రమేయంతో జరిగిందని, మధ్యలో జరిగిన మతలబు ఏంటో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యాపారులకు మేలు జరిగేలా, రైతులకు అన్యాయం జరిగేలా, రైతు కూలీలకు ఇబ్బంది జరిగేలా ఈ నిర్ణయం జరగడం కాకతాళియం కాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంత జరుగుతున్న జులై 31వ తేదీన రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మరో బాంబు పేల్చారన్నారు. కేంద్రం పొగాకు రైతులకు బేరన్ కు ఒక్కొక్క దానికి రూ. 50,000 వడ్డీ లేని రుణం ఇస్తుందని, దానిని రెండు సంవత్సరాలలో తీర్చుకోవాలని, కిలోకు రూ.10 మాత్రమే ధరల వ్యత్యాసం ఇస్తామని ప్రకటన చేశారన్నారు. ఈ ప్రకటన కార్పొరేట్ వ్యాపారులకు మహా సంతోషాన్ని ఇస్తుంటే, వర్జీనియా పొగాకు రైతులకు ప్రాణాంతకమైన విషయంగా (తరువాయి 4లో...)

## రైతు సంక్షేమానికి, గ్రామీణ మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**వెలిగండ్ల మండల కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, కనిగిరి ఎమ్మెల్యే**



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 6)**

చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే అందుబాటులోకి తెచ్చి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత స్పష్టం చేశారు. వెలిగండ్ల మండల కేంద్రంలో డిఆర్‌డిఏ, వెలుగు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ ను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ యంత్ర పరికరాల కొరత వల్ల పంట ఉత్పత్తి తగ్గిపోకుండా నివారించడానికే ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్వయంగా ఖరీదైన యంత్రాలను కొనుగోలు చేయలేని చిన్న, సన్నకారు రైతులకు సిహెచ్‌సిలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కేంద్రంలో 35 హెచ్‌పి ట్రాక్టర్, ట్రిల్లర్, దమ్ము చక్రాలు, కల్టివేటర్, కేజ్ వీల్, డిస్క్ డ్రిల్‌తో పాటు పంట సంరక్షణ కోసం పవర్ మరియు మ్యాన్యువల్ స్ప్రేయర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్థానిక మార్కెట్‌కు అనుగుణంగా సరసమైన అద్దె రేట్లను నిర్ణయించి, తొలుత వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ప్రాతిపదికన పరికరాలు అందజేస్తారని పేర్కొన్నారు. గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళల అవసరాలను గుర్తించి, వారి భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఎఫ్‌పిఓ, విఓ ద్వారా పక్కాగా నిర్వహిస్తారని వెల్లడించారు. పారదర్శకత కోసం (తరువాయి 4లో...)

## అర్హత ఉన్న అందరికీ న్యాయం చేస్తాం

**వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు కలెక్టర్ హామీ**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 6)**

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు అన్ని విధాల అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల సమస్యలపై మార్కాపురం కలెక్టరేట్లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా వెలుగొండ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం నీరు విడుదల చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో ఇంకా డబ్బులు రాని వారికి బిల్లులు అప్లోడ్ చేస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి డబ్బులు వచ్చే విధంగా గా కృషి చేస్తామన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు సమస్యలపై ప్రత్యేక కమిటీలు వేసి త్వరితగట్టిన వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక వసతులను శరవేగంగా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కలనూతల, సుంకేసులు, గుండం చర్ల, చింతల ముడిపి, కాటమరాజు తండా గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రానివాళ్లు ఉన్నారని వారికి తగు న్యాయం చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇంచార్జి ఎరిక్షన్ బాబు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ సమస్యలను త్వరితగతిన (తరువాయి 4లో...)

## కేజీబీవీకి రూ.2.46 కోట్ల అభివృద్ధి

**విద్యారంగంలో మంత్రి లోకేష్ మార్క్**

**ప్రభుత్వ పాఠశాలలకు నూతన రూపు**

**వసతి గృహం, అదనపు తరగతి గదులు, కంప్యూటర్ రూమ్, బయాలజీ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 6)**

ప్రభుత్వ విద్యను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం చిన్నగంజాంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో రూ.2.46 కోట్ల వ్యయంతో నిర్మించిన వసతి గృహం, అదనపు తరగతి గదులు, కంప్యూటర్ రూమ్, బయాలజీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ విద్య, ఆధునిక ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, విశాలమైన తరగతి గదుల ఏర్పాటుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంపుతో పాటు ప్రతి విద్యార్థికి ఆధునిక విద్యా వాతావరణం కల్పించే చర్యలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వమే కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా విద్యారంగంలో సమగ్ర సంస్కరణలు కొనసాగుతున్నాయని చెప్పారు. తాను కూడా గురుకుల పాఠశాలలో చదివి జీవితంలో ముందుకు వచ్చానని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తాను విద్యార్థిగా ఉన్న రోజుల్లో నేడు అందుబాటులో ఉన్న వసతి గృహాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు వంటి సదుపాయాలు లేవన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. విద్యే జీవితాన్ని మార్చగల శక్తి అని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించిన పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి, పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులతో చర్చించారు. ప్రతిభ కనబరిచిన (తరువాయి 4లో...)

## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

**గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు**

**వ్యాపారులు ఇబ్బంది పెడితే ఊరుకోం**

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 6)**

పొగాకు రైతులకు సంపూర్ణ న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, వ్యాపారులు లేదా కంపెనీల యజమానులు రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. పొగాకు రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. లో-గ్రేడ్ పొగాకుకు ప్రభుత్వం తరఫున కిలోకు రూ.10 ల చొప్పున ఆర్థిక సహాయం అలాగే పొగాకు బేలింగ్ ప్రక్రియ కోసం రైతులకు రూ.50,000 వరకు వడ్డీ లేని ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపట్టారన్నారు. గత కొన్ని రోజులుగా వేలం కేంద్రాల్లో బయ్యర్లు లో-గ్రేడ్ సరుకుతో పాటు నంబర్ పడని పొగాకు ధరలను తీవ్రంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని వెంటనే జిల్లా ఇన్చార్జ్ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాబోయే క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చించి, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం ఒత్తిడి తెస్తుందని హామీ ఇచ్చారు. (తరువాయి 4లో...)

## ఈ నెల 10న జైల్ భరో

మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేరన్‌కు రూ.15 లక్షల పెట్టుబడులు పెడితే ఒక్కొక్క బ్యారన్‌కు రూ.5 లక్షల మేర నష్టం ఆదుకోవాలని రైతులు మొరపెట్టుకుంటుంటే రూ.50,000 వడ్డీలేని రుణం ఇస్తామని, కిలోకు ధరలు వ్యత్యాసం రూ.10 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులను అగౌరపరచటం, చులకన చేయటం, అదః పాతాళానికి తొక్కి వేయడం కాదా అని ప్రశ్నించారు.ఎందుకు ఈ ప్రకారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్జీనియా పొగాకు రైతుల పై దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. వేలాది మంది రైతులు, లక్షలాది మంది రైతు కూలీల జీవనోపాధికి భంగం వాటిల్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయో చెప్పాలన్నారు. న్యాయం చేయాలంటూ రైతులు ఆందోళనలు చేస్తుంటే పాలక పార్టీలు మాత్రం రైతులకు న్యాయం చేస్తున్నట్లు నటిస్తూ గొంతులు కోస్తూ యమధర్మరాజుల వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని రైతాంగం సహించే పరిస్థితి లేదన్నారు. వేలం కేంద్రం నాయకులు అని చెప్పుకొనే రైతు ప్రతినిధులు రూ.50,000 బోనస్ ఇవ్వాలని కోరడం రైతులను నష్టం కలిగించే వైఖరీ అన్నారు. ప్లాట్ ఫామ్ నాయకులను ఎన్నుకునే హక్కు పొగాకు రైతులు కల్పించాలని, ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన జరిగే జైల్ భరో కార్యక్రమంలో వర్జీనియా పొగాకు రైతులు, రైతు కూలీలు విరివిగా పాల్గొని తమ నిరసన గళాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కళ్ళు తెరిపించేలా వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి బాబు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ లలిత కుమారి, సహా నాయకులు పరిటాల కోటేశ్వరరావు, గుళ్ళాపల్లి వెంకట్రావు, ఏఐటియూసి నాయకులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి, గ్రామీణ మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత




క్యాష్ బుక్, లెడ్జర్, ఫిర్యాదుల రిజిస్టర్, డిమాండ్ రిజిస్టర్, బుకింగ్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించి, నెలకు ఒకసారి ద్వారా పరిశీలిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శివన్నారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సిఆర్‌పిలు, ఎఫ్‌పిఓ ప్రతినిధులు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేజీబీవీకి రూ.2.46 కోట్ల అభివృద్ధి








విద్యార్థులను అభినందించడంతో పాటు, ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, అబ్జర్వర్ షమిమ్ ఖాన్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు వీరయ్య, హనుమంతరావు, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాఘవయ్య, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం



రైతులు ముందుగా తమ వద్ద ఉన్న లో-గ్రేడ్ పొగాకును వేలంలో విక్రయించుకోవాలని సూచించారు. రైతులు ముందుగా తమ వద్ద ఉన్న లో-గ్రేడ్ పొగాకును వేలంలో విక్రయించుకోవాలన్నారు. నంబర్ పడని లేదా మంచి ధర రాని సరుకును అత్యవసరమైతే ఏసీ గోదాములు లేదా కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో పొగాకు డిమాండ్ పెరిగి వ్యాపారులే నేరుగా వచ్చి కొనుగోలు చేసి పరిస్థితి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులు లేకపోతే కంపెనీలు నడవవు అనే విషయాన్ని వ్యాపారులు కంపెనీ ప్రతినిధులు గుర్తించుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా వారికి పూర్తి న్యాయం జరిగే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న అందరికీ న్యాయం చేస్తాం

పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు వెంకట శివరామిరెడ్డి, అజయ్‌కుమార్, వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూ తాలిం, ఇతర అధికారులు ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.







## కనిగిరిలో నేటి మంచి నీటి సరఫరా నిలిపివేత



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 6)**

కనిగిరి పురపాలక సంఘ పరిధిలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఉన్న త్రాగునీటి కుళాయిలు వద్ద శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పనులు నిర్వహిస్తున్నందున శుక్రవారం ప్రధాన కుళాయిల వద్ద నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ప్రధాన కుళాయిల వద్ద నీరు పట్టుకోవచ్చని తెలిపారు. పుర ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా ట్యాంకు సమీపంలోని రెండు కుళాయిల వద్ద త్రాగునీరు పొందాలన్నారు. కావున పట్టణ ప్రజలు మరమ్మతు పనులకు సహకరించాలని కమీషనర్ కోరారు.

### ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రగతికి పునాదులు..! జంగమహేశ్వరపాడు ప్రచారంలో జూలకంటి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 6)**

రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గం పరిధిలో ఉన్న ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రగతికి పునాదులు పడుతున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి చెప్పారు. గురువారం మండల పరిధిలోని జంగమహేశ్వరపాడు,కాకిరాల, మించాలపాడు గ్రామాల్లో కూటమి పార్టీల శ్రేణులు నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం, ప్రతి ఇంటికీ మీ జూలకంటి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేపట్టారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు,ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు లింగ బ్రహ్మయ్య, జానకిరామయ్య, మాగులూరి నారయ్య, సింగు నాగేశ్వరరావు, యాగంటి నరేష్, విజయ్, కంఠం బ్రహ్మయ్య, పాశం కొండ, ఆవులు జల్లయ్య, గుమ్మ ఆంజనేయులు, గుమ్మ వెంకటేశ్వర్లు, పాశం అంజి, ఆవుల కొండ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ హాస్పిటల్ మొదటి గురువారం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

గత 15 సంవత్సరాలుగా ప్రతి నెల మొదటి గురువారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో భాగంగా గురువారం మన శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో నిర్వహించిన మొదటి గురువారం ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో చిన్నపిల్లల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు చిన్న పిల్లలు, పురిటి బిడ్డల వైద్య నిపుణులు డాక్టర్ కలంకుంట్ల గంగా సాగర్‌రెడ్డి ప్రత్యేక ఆరోగ్య సూచనలు చేశారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు సాధారణంగా వచ్చే డయాబెటిక్ ఫుట్ సమస్యపై సీనియర్ వైద్యులు డాక్టర్ పిన్నాక ప్రశాంత్ సమగ్రంగా వివరించారు. డయాబెటిక్ ఫుట్‌కు గల కారణాలు, ప్రారంభ లక్షణాలు, రోజువారీ పాదాల సంరక్షణ, గాయాలను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం యొక్క ప్రాముఖ్యత గురించి ఆయన అవగాహన కల్పించారు. సుమారు 300 మంది తమ ఆరోగ్య సంరక్షణ కోసం అల్ట్రా సౌండ్ స్కాన్, కంప్యూటర్ ద్వారా వివిధ రకాల ఆధునిక కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్, థైరాయిడ్, హిమోగ్లోబిన్, బీఎండి, దంత పరీక్షలు లాంటి 10 వేల రూపాయల విలువ గల 16 రకాల వివిధ టెస్ట్ లను ఈ శిబిరంలో ఉచితంగా వినియోగించుకోవడం జరిగింది. ఈ మొదటి గురువారం ఉచిత వైద్య శిబిరం నందు సీనియర్ ఎముకలు, కీళ్లు, నరములు, కీళ్ల మార్పిడి, యాక్సిడెంట్, వెన్నెముక శస్త్ర చికిత్సా నిపుణులు, చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, సీనియర్ గర్భకోశ ప్రసూతి వైద్య నిపుణులు, హైరిస్క్ ప్రెగ్నన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి, డయాబెటాలజిస్ట్, జనరల్, ఫ్యామిలీ ఫీజీషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, సీనియర్ జనరల్, లాప్రోస్కోపిక్ సర్జన్, మినిమల్ యాక్సెస్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ పిన్నక ప్రశాంత్, ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ నాగిడి కుమార్‌వర్మ, కంటి స్పెషలిస్ట్ డాక్టర్ పురాణపు మహిత, చిన్న పిల్లలు, పురిటి బిడ్డల వైద్య నిపుణులు డాక్టర్ కలంకుంట్ల గంగా సాగర్‌రెడ్డి, చెవి, ముక్కు, గొంతు ఈ ఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ తాడి సాయి ప్రసాద్, అనస్థీషియా, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ముప్పరాజు దీప్తి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, స్మైల్ డిజైనింగ్, డెంటల్, కాస్మొటిక్ సర్జన్ డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వినయ్, షేక్ లాల్, ఫిజియోథెరపీ వైద్య నిపుణులు డాక్టర్ పొక్కినగారి ఏడుకొండలు, హాస్పిటల్ మేనేజర్ పల్లా సురేష్, మార్కెటింగ్ మేనేజర్ మణి చంద్ర కాంత్ పాల్గొని అందరినీ పరీక్షించి తగిన సలహాలు, సూచనలు అందించారు.



## నేరాల నియంత్రణకు ముమ్మరంగా నైట్ చెకింగ్ అనుమానితుల పై ప్రత్యేక నిఘా

**అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు**

**జిల్లా పోలీసుల ముమ్మర గస్తీ**

**ఏటీఎంలు, లాడ్జిలు, ప్రధాన వ్యాపార కేంద్రాల పై ప్రత్యేక నిఘా**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం నేరాల నియంత్రణే, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీ విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ నైట్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నారు. దొంగతనాలు, ఇతర నేర సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల పై క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. జిల్లాలోని ఏటీఎంలు, బ్యాంకులు, ప్రధాన వ్యాపార కేంద్రాల వద్ద భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేస్తూ, ఏటీఎం కేంద్రాల వద్ద పోలీసులు నిరంతర గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు, వాహనాలను తనిఖీ చేసి వాటి రవాణా వివరాలను సేకరిస్తున్నారు. పాత నేరస్తులు, చెడునడత కలిగిన వ్యక్తులు మరియు అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉండే వారి ఆధార్ వివరాలను పరిశీలిస్తున్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే దిశగా, రాత్రి వేళల్లో అల్లర్లు, గొడవలు, దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, కారణం లేకుండా తిరిగే ఆకతాయిల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## గుండెపోటుతో ఏఎస్ఐ శ్రీనివాసులు అకాల మరణం

**భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కందుల**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 6)**

పొదిలి పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి శ్రీనివాసులు అకస్మాత్తుగా గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసులు భౌతికకాయాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో శ్రీనివాసులు అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. భౌతికయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌చార్జి వరికుంట్ల అనిల్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, తదితరులు ఉన్నారు. అనంతరం ఏఎస్ఐ శ్రీనివాసులు కుటుంబ సభ్యులను నాయకులు పరామర్శించారు. శ్రీనివాసులు ఆకస్మిక మరణంతో శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ఈ భారాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

సుబ్రమణ్యేశ్వరస్వామి ఆశీస్సులతో నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆకాంక్షించారు. ఆడికృత్తిక పుణ్యతిథిని పురస్కరించుకొని స్కందగిరి, గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వెలిసిన వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు , కుమార్తెలు అనీషా లక్ష్మీ, తనూజా లక్ష్మి వేల్ కావడి మోస్తూ గుడిచుట్టూ ప్రదక్షణ చేశారు. తమిళ సంప్రదాయంలో ఆషాడమాసంలో సుబ్రమణ్యేశ్వరస్వామి ఆరాధన చేసి, వేల్ కావడి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. నగరంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి భక్తులు వేల్‌కావడి స్వామి వారికి సమర్పించుకునేందుకు దేవాలయాలకు వచ్చి కన్నయ్య గురుస్వామి ఆధ్వర్యంలో శూలాలు నోట్లో గుచ్చుకొని భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. నగరపార్టీ అధ్యక్షుడు బండారు మదన్, ఒంగోలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పప్పు శ్రీనివాసరావు, శివాలయం దేవస్థానం ఛైర్మన్ తూము సుబ్బారావు, మాజీ కార్పొరేటర్‌లు తిప్పరపల్లి రవితేజ (కిట్టు), శాండిల్య, పులివర్తి అజయ్, పిఎస్ బాబు, సుజాత, తూము రాజేష్, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబరు కామరాజుగడ్డ కుసుమకుమారి, గుంటూరు రాంబాబు, పాలపర్తి లక్ష్మీనారాయణ, కూరపాటి కాశీరావు, తదితరులు పాల్గొన్నారు.

## సారధి స్టూడియోలో సందడి..

### "డోన్ట్ ట్రబుల్, ది ట్రబుల్" విశేషాలు పంచుకున్న నిర్మాత ఎస్ఎస్ కార్తికేయ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

హైదారాబాద్ ఎస్ఆర్. నగర్ సారథి స్టూడియోస్‌లో జరుగుతున్న "డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్ " సినిమా షూటింగ్ సెట్‌ను మాజీ డీఆర్‌యూసీసీ సభ్యుడు ఎంఎన్ రెడ్డి, ఏజె న్యూస్ ఎడిటర్ అన్వర్ హుస్సేన్, ఏజె న్యూస్ పల్నాడు ప్రతినిధి అమీర్ ఖాన్, వెంకట రాజేష్, అడ్వకేట్ కమలాకర్ మర్యాదపూర్వకంగా సందర్శించి నిర్మాత ఎస్ఎస్ కార్తికేయను కలిశారు. ఈ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో, శశాంక్ ఏలేటి దర్శకత్వంలో ఫహద్ ఫాజిల్, సారా పాలేకర్, సౌరభ్ సచ్‌దేవా ప్రధాన పాత్రల్లో "డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్" చిత్రాన్ని శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనిలతో కలిసి నిర్మిస్తున్నట్లు తెలిపారు. నటుడు సుబ్బరాజు కీలక పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నారని, ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతోందని వెల్లడించారు. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్ర బృందానికి విచ్చేసిన ప్రముఖులు ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎల్‌నినో పట్ల ఆందోళన అవసరం లేదు

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
జిల్లాలో సమగ్ర కార్యాచరణతో ప్రత్యామ్నాయ చర్యలు
ముందస్తు ప్రణాళికతో సాగు,
తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు
జిల్లాలో పరిస్థితులు, ప్రత్యామ్నాయ చర్యలను
పిపిటి ద్వారా వివరించిన కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు
పలు కీలక సూచనలు, సలహాలు











**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 6)**

"ఎల్‌నినో" ప్రభావంతో ఈ ఏడాది జిల్లాలో వర్షపాతం తగ్గినప్పటికీ ముందస్తు ప్రణాళిక, జలవనరుల సమర్థ నిర్వహణ, శాఖల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉంటే కరవు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత చర్యలు పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి ఆదినారాయణరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కొత్త కృష్ణ చైతన్య రెడ్డి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావనతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ సాగు పురోగతి, సహజ వ్యవసాయం, రైతులకు అందిస్తున్న సాంకేతిక సూచనలు, పశుసంవర్ధక, తాగునీటి భద్రత, ప్రజారోగ్యం, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. జిల్లా ప్రధానంగా వర్షాధార, భూగర్భ జలాలపై ఆధారపడిన వ్యవసాయ ప్రాంతమని, సాగులో అధిక భాగం బోరు నీటి ద్వారానే సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రధాన జలాశయాల ద్వారా సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది జూన్--జూలై నెలల్లో సాధారణంతో పోలిస్తే 47.3 శాతం వర్షాభావం నమోదైందని, జూన్‌లో 68 మిల్లీమీటర్లకు బదులుగా 50 మిల్లీమీటర్లు, జూలైలో 97 మిల్లీమీటర్లకు బదులుగా కేవలం 24 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు 6 వరకు నమోదైన ఈ వర్షాభావం ఎల్‌నినో ప్రభావానికి స్పష్టమైన సూచిక అని పేర్కొన్నారు. జిల్లాలోని జలాశయాల్లో మొత్తం నిల్వ సామర్థ్యం 82.26 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 39.88 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. గత మార్చిలోనే జలాశయాలతో పాటు వాటి పరిధిలోని చెరువులను నింపడం వల్ల ప్రస్తుతం దాదాపు 50 శాతం మేర నీటి నిల్వలు కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో ఖరీఫ్, రబీ సాగుతో పాటు వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను కూడా నిర్వహించే పరిస్థితి ఉందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదల ప్రారంభం కావడంతో జీఎన్ఎస్ఎస్ పరిధిలోని జలాశయాల్లో నీటి నిల్వలు మరింత పెరిగే అవకాశం ఉందని వివరించారు. భూగర్భ జలమట్టం గత ఏడాదితో పోలిస్తే సగటున 0.79 మీటర్లు తగ్గిందని, కొన్ని మండలాల్లో 41 నుంచి 45 మీటర్ల లోతులో నీటి మట్టం నమోదవుతోందని తెలిపారు. అయితే దీనికి కేవలం వర్షాభావమే కాకుండా ఆయా ప్రాంతాల భౌగోళిక నిర్మాణం కూడా కారణమని చెప్పారు. అలాంటి మండలాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు సుమారు 70,539 హెక్టార్లలో, అంటే సాధారణ విస్తీర్ణంలో 22.9 శాతం మేర విత్తనాలు పూర్తయ్యాయని తెలిపారు. వేరుశెనగ, పత్తి, పెసర, కంది, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగు కొనసాగుతోందని, రాబోయే 7 నుంచి 10 రోజుల్లో మంచి వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరుకునే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు పంటలు--నీటి నిర్వహణ, భూగర్భ జలాల మౌలిక వసతుల బలోపేతం, రైతులకు సహాయక చర్యలు, పశుసంపద సంరక్షణ అనే నాలుగు ప్రధాన అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి వారం రైతులకు శాస్త్రీయ వ్యవసాయ సలహాలు అందించడంతో పాటు, రాబోయే ఏడు రోజులు, ఎనిమిది వారాల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. సహజ వ్యవసాయం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను కూడా ప్రజెంటేషన్‌లో వివరించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్), విత్తన గుళికల తయారీ, బహుళ పంటల సాగు, జీవ ఎరువుల వినియోగం, కరువు నివారణ నమూనాలు, హాఫ్‌మూన్ విధానం వంటి వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 97,960 మంది రైతులను 1,19,013 ఎకరాల్లో ఈ కార్యక్రమాల కింద లక్ష్యంగా పెట్టుకు న్నామని, అధిక ప్రమాద మండలాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జీవ వనరుల కేంద్రాల ద్వారా సహజ వ్యవసాయ ఉత్పాదకాలు అందుబాటులో ఉంచడం, రైతులకు శిక్షణలు, విత్తన కిట్ల పంపిణీ, పాఠశాలలు, అంగన్‌వాడీలు, స్మార్ట్ కిచెన్లకు సహజ వ్యవసాయ ఉత్పత్తులను అనుసంధానం చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవనం, పశుసంవర్ధక, తాగు నీరు, ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలు, నీటి పొదుపు, మల్చింగ్, పంటల బీమా నమోదు, రైతులకు నిరంతర సాంకేతిక సూచనలు, పశుగ్రాస నిల్వలు, పశువైద్య సేవలు, తాగునీటి వనరుల పరిరక్షణ, వ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు కూడా పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాంతానుకూల ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి సూచించారు. పశుగ్రాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ సి. ఆదినారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని ఉపాధి హామీ కూలీలు, సంఘటిత, అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేయించి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డ్వామా, డీఆర్డీఏ, మెప్మా అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలను ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, జీవనోపాధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించేలా రుణ ప్రణాళిక రూపొందించాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌కు సూచించారు. జిల్లాలోని వాస్తవ పరిస్థితులను ప్రతిరోజూ సమీక్షిస్తూ, నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించడం, రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించడం, శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ, వర్షాల పరిస్థితిని బట్టి సాగు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

**కర దీపికల ఆవిష్కరణ...**

"ఎల్ నినో" పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యవసాయ అనుబంధ మంత్రిత్వ శాఖ ప్రచురించిన ప్రత్యేక కర దీపికలను జిల్లా కలెక్టర్.. ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇంజినీర్లు, వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి సేద్యం, పశుసంవర్ధక శాఖ, ఎపిఎంఐపీ, డ్వామా, డీఆర్డీఏ, ఎల్డిఎం, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాల పై ప్రత్యేక నిఘా

### ఒంగోలు పట్టణ డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వరుస దొంగతనాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయటం జరిగిందని ఒంగోలు పట్టణ డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలపై డిఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమకుర్తి మద్దిపాడు ఒంగోలులో జరిగిన కొన్ని కేసులలో రికవరీ చేయగలిగామని అన్నారు. ఆశ్రమం దగ్గర జరిగిన దొంగతనం పై ప్రత్యేక టీం ఏర్పాటు చేశామని ఇంకా కనుగొనలేకపోయామని అన్నారు. ఒంగోలు నగరంలో రెండు ఇళ్లల్లో ఒకేరోజు దొంగతనాలు జరగడంపై పోలీస్ సీరియస్ గా తీసుకుందని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలనుసారం నగరంలో మెన్ పవర్ ని పెంచి వాహనాలు తనిఖీలు కూడా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రధానంగా ఇంటి




యజమానులు వ్యాపారస్తులు వారు నివాసాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కొంత దొంగతనాలు అరికట్టానికి అవకాశం ఉంటుందని అన్నారు. టెక్నాలజీ పెరిగినప్పటికీ దొంగలు కూడా దొంగతనాల కోసం టెక్నాలజీని అందుపుచ్చుకుంటున్నారని అలాంటి వాటిని అరికట్టేందుకు ప్రధానంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లోను తాలూకా పోలీస్ స్టేషన్ లిమిట్లను సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ లిమిట్స్ లోని రౌడీషీటర్లు కొంత అలజడి సృష్టించారని వారికి ప్రత్యేకంగా కౌన్సిల్ ఇవ్వడం జరిగిందని అన్నారు. అక్కడొకడు చిన్నపాటి గొడవలు తప్ప ఎక్కువమంది పాత నేరస్తులు తమ పనులు తమ నిమగ్నమై ఉన్నారని ఇంటింటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వటం వల్ల కూడా కొంత మార్పు వచ్చిందని అన్నారు. ఏదేమైనా ప్రజలు భయపడాల్సిన పనిలేదని పోలీస్ వ్యవస్థ ఎప్పుడు పటిష్టంగా ఉందని దొంగతనాలు, రౌడీ షీటర్ల పై ప్రత్యేకంగా ఉంటుందని తెలిపారు. మీడియా సమావేశంలో తాలూకా సీఐ టీ. విజయకృష్ణ, వన్ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, టూ టౌన్ సిఐ వీర నాయక్ ఉన్నారు.

## దగా డీఎస్సీ పై ప్రజా పోరాటం

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 6)**




డీఎస్సీ 2025 నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎర్రగొండపాలెం పట్టణంలో గురువారం తొలి రోజు రిలే నిరాహార దీక్ష ప్రారంభమైంది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఆగస్టు 9 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి. నిజాయితీగా చదివిన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరగాలి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు జెడ్పీటిసిలు ఎంపీపీలు సర్పంచులు ఎంపీటీసీలు అనుబంధ విభాగాల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి భాగాలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగానికి కొత్త ఊపు
# కోట్ల రూపాయలతో మౌలిక వసతుల విస్తరణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 6)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, విద్యుత్ రంగాన్ని మళ్లీ గాడిలో పెట్టి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం చిన్నగంజాం మండల కేంద్రంలో రూ.1.80 లక్షలతో నిర్మించిన 33 కెవి, 11 కెవి విద్యుత్ లైను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు... అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ రంగంలో సమగ్ర సంస్కరణలు అమలు చేస్తూ, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని చెప్పారు. కొత్తపాలెంలో రూ.1 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఎమర్జెన్సీ రెస్పాన్స్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అదే కార్యక్రమంలో రూ.1 కోట్లతో నిర్మించిన 33 కేవీ విద్యుత్ లైన్, రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లైన్‌ను కూడా ప్రారంభించారు.

### 2014లోనే సంస్కరణలకు శ్రీకారం

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగంలో విస్తృత సంస్కరణలు చేపట్టిందని ఎమ్మెల్యే ఏలూరి గుర్తు చేశారు. ప్రతి గ్రామ అవసరాలకు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. అనంతరం గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆ వ్యవస్థ బలహీనపడగా, ప్రస్తుతం మళ్లీ పటిష్టం చేస్తున్నామని పేర్కొన్నారు.

## 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం
## రూ.1.80 లక్షలతో నిర్మించిన విద్యుత్ లైన్లు ప్రారంభోత్సవం



### ట్రూ అప్ నుంచి ట్రూ డౌన్ వరకు నిర్ణయాలు

ప్రజలపై భారం తగ్గించే దిశగా విద్యుత్ రంగంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, ట్రూ-అప్ చార్జీల విధానానికి బదులుగా ట్రూ-డౌన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, అందుబాటు ధరల్లో విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### మండలంలో స్తంభాల మార్పు వేగవంతం

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో విద్యుత్ స్తంభాలను వేగవంతంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. గ్రామాల్లో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో పాత స్తంభాల మార్పు పూర్తిచేస్తామని తెలిపారు.

### 24 గంటల నాణ్యమైన విద్యుత్ లక్ష్యం...

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 24ఐ7 నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం ఇస్తోందని, గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరిస్తూ నిరంతరాయ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతోందన్నారు.

### రూఫ్ టాప్ సోలార్‌కు విశేష స్పందన...

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే సుమారు 6,000 మంది ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో వెనుకబడిన వర్గాల (బీసీ) కుటుంబాలకు కూడా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో విద్యుత్ ఖర్చు తగ్గడంతో పాటు స్వయం సమృద్ధి సాధ్యమవుతుందన్నారు.

### కొత్త సబ్‌స్టేషన్ల పనులు శరవేగం

కొణికి, బొల్లాపల్లి ప్రాంతాల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇవి పూర్తయితే వోల్టేజ్ సమస్యలు తగ్గడంతో పాటు విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా మారుతుందని అధికారులు వెల్లడించారు. విద్యుత్ రంగంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, రైతులు, గృహ వినియోగదారులు, చిన్న పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందే పరిస్థితులు ఏర్పడనున్నాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ థామస్, డి ఈ శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

## మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 పై అవగాహన, మోటార్ సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జిల్లా న్యాయమూర్తి, చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు ఎ సత్యానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ సత్యానంద్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ఇటువంటి కార్యక్రమాలు వివిధ రూపాల్లో ప్రజలకు చేరువు చేయటం జరుగుతుందన్నారు. మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమైన విధానమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సుహృద్భావ సంబంధాలను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మోటార్ వెహికల్ ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఒంగోలు చర్చ్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వం పై అవగాహన కల్పించడంతో పాటు న్యాయ అవగాహనను పెంపొందించేందుకు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చావలి రమేష్ బాబు మధ్యవర్తిత్వ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు మీరితే జైలుకే
## సీఐ రాజేష్ హెచ్చరిక
### రోడ్డు నిబంధనల ఉల్లంఘనదారుల పై పోలీసులు ఉక్కుపాదం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 6)

మద్యం సేవించి వాహనాలు నడిపే వారి విషయంలో ఇక పై ఎలాంటి మినహాయింపులు ఉండవని, దొరికితే నేరుగా జైలుకు



పంపుతామని సిఐ రాజేష్ ఘాటుగా హెచ్చరించారు. పెద్ద బస్టాండ్ సెంటర్లో వాహన తనిఖీల్లో భాగంగా గురువారం వాహనదారులకు పలు సూచనలు చేశారు. కేవలం జరిమానాతో వదిలిపెట్టే రోజులు పోయాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే కౌన్సెలింగ్‌తో పాటు నేరుగా రిమాండ్‌కు తరలిస్తాం అని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, లేని పక్షంలో జరిమానాలు తప్పవన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మైదుకూరు కోర్టు ఏజీపీగా
## భూమిరెడ్డి శ్రీనివాసులు నియామకం

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 6)

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు ఏజీపీగా ప్రముఖ న్యాయవాది భూమిరెడ్డి శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం కడప జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ పదవిలో బాధ్యతలు నిర్వర్తించేందుకు గాను ఆయనకు ప్రభుత్వం తరఫున నెలకు రూ.10,000 గౌరవ వేతనం అందనుంది. గతంలో వైద్య రంగంలో సమాజానికి విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన బి శ్రీనివాసులు, ఇప్పుడు న్యాయరంగంలోనూ ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించే బాధ్యతను స్వీకరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన భూమిరెడ్డి శ్రీనివాసులు, కడప ఎయిర్‌పోర్ట్‌లో మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి, తనపై నమ్మకంతో ఏజీపీ బాధ్యతలు అప్పగించేందుకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక న్యాయవాదులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు శ్రేయోభిలాషులు భూమిరెడ్డి శ్రీనివాసులును కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బాధితులకు తగిన న్యాయం జరిగేలా శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.






## మత్స్యకార గ్రామాలకు రూ.35 లక్షల విలువైన యూనిట్ల పంపిణీ
### ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

మత్స్యకార గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గుండమాల, కే పల్లెపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు గ్రామాలకు చెందిన మత్స్యకారులకు సుమారు రూ.35 లక్షల విలువైన యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014-2019 మధ్య కాలంలో మత్స్యకార గ్రామాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు ఒక వల కూడా అందించలేదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే మూడుసార్లు మత్స్యకారులకు వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. 40 శాతం సబ్సిడీతో ఐదు బోటు ఇంజిన్లను పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని చెప్పారు. అలాగే రూ.25.23 లక్షల విలువైన 87 ట్రాన్స్‌పాండర్లను పూర్తి సబ్సిడీతో మత్స్యకారులకు అందజేసినట్లు వెల్లడించారు. మత్స్యకార గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు జి పేరయ్య, నాయుడు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీలు పిన్ని నరసింహారావు, నాయుడు శ్రీను, కొక్కిలిగడ్డ లక్ష్మి, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అవకతవకల పై మంత్రి లోకేష్ రాజీనామా చేయాల్సిందే
### ఒంగోలులో ప్రారంభమైన వైయస్సార్సీపి విద్యార్థి విభాగం నాలుగు రోజుల రిలే నిరాహార దీక్షలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

డీఎస్సీలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్సీపి యువజన విభాగం,విద్యార్థి విభాగం పల్నాటి రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల నిరాహార దీక్ష స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైయస్సార్సీపి ఒంగోలు నియోజక వర్గం ఇన్చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ డీఎస్సీలో అవకతవకలు, మోసపోయిన నిరుద్యోగ యువత, డీఎస్సీలో అర్హత సాధించి మోసపోయిన యువతకు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రంలో పాలన పక్షపాత వైఖరితో కొద్దిమంది కి మాత్రమే అనుకూలంగా నడుస్తుంది అన్నారు. సామాన్యులను మోసం చేస్తూ, డబ్బున్న వారికే దాసోహం చేస్తూ, ప్రతి అవకాశాన్ని అమ్ముకుంటూ, రాష్ట్రంలో ఒక దుర్మార్గపు పాలన నడుస్తుందన్నారు. టిడిపిలో పదవులను అమ్ముకుంటున్నారని, క్యాడర్ను మోసం చేస్తున్నారని, అప్పటికప్పుడు వచ్చిన వారికి టికెట్లు ఇచ్చి, మంత్రి పదవులు ఇచ్చి, కేంద్ర మంత్రులను కూడా చేశారన్నారు. కానీ సమాజంలోని నిరుద్యోగులను తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తే, వారి ఆశలను అడియాసలు చేసే హక్కు మీకు ఎవరిచ్చారు అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీలో జరిగినవన్నీ అక్రమాలే అన్నారు. రెండు సంవత్సరాల తర్వాత 16,000 ఉద్యోగాలు మీరు ఓపెన్ చేస్తే, దాంట్లో పేపర్ లీక్ అయిందని, ఆ పేపర్ లీక్ చేసిన వారే టెస్టులు రాశారని, వారికే ర్యాంకులు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో సిగ్గుపడాలని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన, నిరుద్యోగ యువత పక్షాన వైయస్సార్సీపి ఎల్లవేళలా ఉంటుందని పేర్కొన్నారు. వైయస్సార్సీపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పల్నాటి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ స్కాంపై బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రియంబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి వెంటనే విడుదల చేయాలని, ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని, స్పోర్ట్స్ అసోసియేషన్లో ఉద్యోగాల బేరసాగాలు యదేచ్ఛగా సాగాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వై వెంకటేశ్వర్లు నాయుడు, ఒంగోలు రూరల్ మండలం అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి, మన్నే శ్రీను, నగర అధ్యక్షులు కటారి శంకర్, మలిశెట్టి దేవా, శ్రీకాంత్, ఒంగోలు నగర స్టూడెంట్, యువజన అధ్యక్షులు పాల్గొన్నారు.



## నేడు మైదుకూరు అమ్మవారిశాలలో శాకంబరీ దేవి మహోత్సవం

**ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాన్ని చెన్నకేశవ ప్రసాద్ వెల్లడి**



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 6)**

స్థానిక మైదుకూరు పట్టణంలోని శ్రీమత్ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిలి దేవస్థానంలో పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆగస్టు 7 శాకంబరీ దేవి మహోత్సవం అత్యంత వైభవంగాలి నిర్వహించనున్నట్లు మైదుకూరు ఆర్యవైశ్య సభఅధ్యక్షులు బళ్లాని చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరు పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు విలసిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ విశేష పూజా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. సంయుక్త భాగస్వామ్యంతో ఈ విశేష కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సభ, ఆర్యవైశ్య మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త భాగస్వామ్యంతోలి ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వాసవి మాతను వివిధ రకాల పచ్చని ఆకుకూరలు, రంగురంగుల తాజా కూరగాయలు, పండ్లతో సర్వాంగ సుందరంగా శాకంబరీ దేవిగా అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఈ దివ్య మంగళ రూపాన్ని దర్శించుకోవడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఆలయానికి విచ్చేసే భక్తులందరికీ మధ్యాహ్నం 12:30 గంటల నుండి మహా ప్రసాద విందు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సోదరీసోదరులు, అమ్మవారి భక్తాదులందరూ కుటుంబ సమేతంగా విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

## అర్ధవీడు మండలంలో 'ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనల' కార్యక్రమం

**నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం**
**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**
**హాజరుకానున్న జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 6)**



ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు మరింత వేగంగా చేరవేస్తూ, వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే లక్ష్యంతో శుక్రవారం గిద్దలూరు నియోజకవర్గంలో 'ఒక నెల,ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. మండల కేంద్రమైన అర్ధవీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన కోసం జిల్లా స్థాయి అన్ని శాఖల అధిపతులు, గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులు గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ అర్ధవీడు మండలంతో పాటు గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తమ అర్జీలు, సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. అధికారులు ఎటువంటి అలసత్వం వహించకుండా, ప్రజల సమస్యల పై తక్షణమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

# కూటమి పాలన పై ప్రజలు తిరగబడటం ఖాయం

**మాజీ మంత్రి డాక్టర్ కాకాణి**
**నైతిక విలువలు ఉంటే విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి**
**మాజీ ఎమ్మెల్యే బుర్రా**





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 6)**

డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నిరసనగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి , ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొని యువత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ టిడిపి నాయకులు రెండేళ్ల నమ్మకం అంటూ తిరుగుతున్నారు. అది రెండేళ్ల నమ్మకం కాదు ఆంధ్రప్రదేశ్ అమ్మకం. అని ఎద్దేవా చేశారు.డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి, నైతిక విలువలు లేని కుటుంబం ఏదైనా ఉంది అంటే అది నారావారి కుటుంబమే అని అన్నారు. డిఎస్సీ నియామకాల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని, ప్రభుత్వంపై ఎన్ని నిరసన కార్యక్రమాలు చేపట్టినా స్పందించడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా పేరుతో అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.జీవో మార్పులతో డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం తలపెట్టారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో ఎంఎస్ నంబర్ 74 ప్రకారం కేవలం 29 క్రీడాంశాలకు మాత్రమే స్పోర్ట్స్ కోటా వర్తించేది. కూటమి ప్రభుత్వంలో జీవో ఎంఎస్ నంబర్ 47 ద్వారా ఈ క్రీడల సంఖ్యను 29 నుండి 65కి పెంచి, స్పోర్ట్స్ కోటాను 2% నుండి 3%కి మార్చారు. బ్రిడ్జ్ (పేకాట), తాడు లాగుడు పోటీలు, యోగాసనాలు వంటి అంశాలను కూడా క్రీడల జాబితాలో చేర్చి, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన వారికి అక్రమంగా ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు. జీవో ఎంఎస్ నంబర్ 47 తీసుకువచ్చి, స్పోర్ట్స్ కోటా లభ్యం అభ్యర్థులకు పోటీ పరీక్షలు (రిటన్ ఎగ్జామ్) రాయాల్సిన అవసరం లేదని మినహాయింపు ఇవ్వడం దారుణమని, దీని వల్ల కష్టపడి చదువుకున్న అభ్యర్థులు, నిజమైన క్రీడాకారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రబాబు పై ఒత్తిడి పెంచి లోకేష్ మెడలు వంచి నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. అధ్యక్షత వహించిన బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నైతిక విలువలుంటే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు కూటమి పెద్దలు చంద్రబాబు నాయుడు లోకేష్ పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను చూసైనా నైతిక విలువలకు కట్టుబడి విద్యాశాఖ మంత్రి చేత రాజీనామా చేయించాలని అన్నారు కందుకూరు నియోజకవర్గంలో పొగాకు రైతుల సమస్య తీవ్రంగా ఉందని జగన్మోహన్ రెడ్డి రైతులకు అండగా కందుకూరులో పర్యటించనున్నారని ఈ సందర్భంగా తెలిపారు రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వ రంగంలోని కోర్టును నడపాలని భూములు ఇచ్చిన రైతులు ఇల్లు కోల్పోయిన స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు ప్రజల పక్షాన ఏపోరాటానికైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మొదటి రోజున విద్యార్థులు, యువకులు, డీఎస్సీ అభ్యర్థుల దీక్షలో కె అశోక్, కె మధుసూదన్, సిహెచ్ సురేష్, రవిరాజ్, జంపని అనురాధ, కుమార స్వామి, పి అమరనాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జి శివ, దగ్గు మాటి కాలేషా, కె అనీల్, సి హెచ్ అనీల్, సాయి, యన్ మురళీ, టి ఆదిలక్ష్మి, మద్దసాని నవీన్‌తో పాటుగా పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, లింగసముద్రం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, జిల్లా నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, బద్దిపూడి జయరావు, రాష్ట్ర నాయకులు వల్లూరి కోటేశ్వరరావు, వెలిచెర్ల ధనకోటి, పేయ్యాల రమేష్ యాదవ్, ఎంపీపీ పులి రమేష్, రావులకొల్లు బ్రహ్మానందం, గెరా మనోహర్, బిల్లా రమణయ్య, మర్లపాటి ఆదామ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు రిలే నిరాహార దీక్షను మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు.

# ఆత్మకూరు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం



**వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 6)**

తల్లిపాల వారోత్సవాల సందర్భంలో భాగంగా గురువారం ఆత్మకూరు పంచాయతీ అంగన్వాడీ కేంద్రాల్లో సిడిపిఓ డి. మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం చేయడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో భాగంగా సూపర్వైజర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత తల్లిపాలలో ఉండే ఔషధ గుణాలు గురించి 6 నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలి అట్లానే వాళ్ళు ఎటువంటి పరిస్థితుల్లో అయినా సరే ఉద్యోగానికి వెళ్లే వాళ్ళైనా సరే బిడ్డలకి తల్లిపాలు తల్లిపాలు తాపించవచ్చు సుస్థిరమైన జీవితానికి తల్లిపాల సంతృప్తిని ప్రోత్సహిద్దాం. అదే దిశగా ఫలితాలు ఇచ్చుచున్న కార్యక్రమాల్ని మరింత బరోపేతం చేయడంలో భాగంగా ఈ వారోత్సవాన్ని జరపటమైనది ఈ తల్లిపాల వల్ల ప్రయోజనాలలో ముఖ్యంగా శిశువుకి రోగనిరోధక శక్తి పెంపుగా ఉంటది మెదడు ఎదుగుదల మరియు జీర్ణక్రియ మెరుగుగా ఉంటుంది తల్లికి ప్రయోజనాలు గర్భసాయ సంకోచ మెరుగుదల తల్లి ఆరోగ్యం సక్రమంగా ఉంటది గర్భసంచి గర్భ కోసం క్యాన్సర్లు కూడా రాకుండా చేస్తుంది. కుటుంబానికి ఆరోగ్యవంతమైన శిశువు తర్వాత సమయము ఆదా కూడా చేయవచ్చు సంతోషకరమైన కుటుంబాన్ని మనం అలవర్చుకోవచ్చు సమాజానికి ప్రయోజనాలకు వచ్చేసరికి ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది జాతీయ అభివృద్ధి దోహదం సుస్థిర భవిష్యత్తుని మనము ఈ తల్లిపాల ద్వారా సాధించుకోవచ్చని తల్లులకి తెలియజేయడమైనది. ఈ ముఖ్యమైన అంశాలు మొత్తం సిడిపిఓ ఆదేశాల మేరకు కరేడు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతే కాకుండా గర్భవతులకు శ్రీమంతాలు కూడా చేయడం జరిగింది. తల్లిపాల ప్రాముఖ్యత ముందు గర్భవతి దగ్గర నుంచి ఆ తల్లికి తల్లిపాల గురించి వివరించి తల్లిపాల గురించి, వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి కూడా చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లులు, గర్భవతులు, బాలింతలు, సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం అందరూ పాల్గొన్నారు.



## డబ్బాపాలు వద్దు.. తల్లిపాలే బిడ్డకు అమృతం కంభంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 6)**

మార్కాపురం జిల్లా కంభంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, అంగన్వాడీ సిబ్బంది చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని "డబ్బాపాలు వద్దు-తల్లిపాలు ముద్దు", "ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా", "తల్లిపాలు బిడ్డకు అమృతం" వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. లలిత సులోమి మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం ఎంతో అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ప్రతి తల్లి దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, చిన్నారులతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు ఏ శారద, సీహెచ్ భారతి, ఏఎన్ఎంలు జాన్సీ, స్వాతి, శశికళ, తదితరులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## అత్యంత భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వేల్ కావడి ఊరేగింపు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)**

ఒంగోలు నగరంలో ఆడికృత్తిక పుణ్య తిథిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వేల్ కావడి ఊరేగింపును నిర్వహించారు. స్కందగిరి గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర నగర ప్రధాన వీధుల గుండా సాగి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు శరీరానికి వెండి, ఉక్కు సోలాలు (వేల్‌లు) గుచ్చుకొని, "వేల్ కావడి"ని మోస్తూ స్వామివారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి గీతాలు, నినాదాలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ జరిగిన ఈ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆడికృత్తిక విశిష్టత: ఆడి మాసంలో వచ్చే కృత్తిక నక్షత్రాన్ని "ఆడికృత్తిక"గా అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఈ రోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆరాధిస్తే ధైర్యం, ఆరోగ్యం, శత్రు నివారణ, సంతాన సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. వేల్ కావడి సమర్పించడం ద్వారా మొక్కులు నెరవేరుతాయని, స్వామివారి అనుగ్రహం లభిస్తుందని పురాణాలు, ఆచార సంప్రదాయాలు చెబుతున్నాయి. అందుకే ప్రతి ఏడాది ఆడికృత్తిక సందర్భంగా వేలాది మంది భక్తులు ఉపవాస దీక్షలు పాటించి, వేల్ కావడి సమర్పిస్తూ ప్రత్యేకంగా స్వామివారిని దర్శించుకుంటారు.







## పంటల సాగు పై రైతులకు సూచనలు, సలహాలు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 6)**

ప్రస్తుతం నెలకొని ఉన్నటువంటి ఎల్ నినో వాతావరణ పరిస్థితుల్లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని పంటల సాగు చేసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పివి సత్యనారాయణ తెలియజేశారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల మండలం రాయవరం గ్రామంలో సాగవుతున్నటు వంటి ప్రత్తి పంట అలాగే మిగతా పంటల ను వారు పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఈ ఆగస్టులో కురిసేటువంటి వర్షాలు ప్రత్తి పంటను నిలదొక్కుకునేలా ఉంచుతాయని కాబట్టి ప్రత్తి పంట ఈ ఖరీఫ్ కాలంలో ప్రత్తి పంట మంచిగా ఉండే అవకాశం ఉందని తెలియజేశారు. అలాగే ప్రస్తుతం ప్రత్తి పంట బెట్టకు గురవుతున్నటువంటి ఈ పరిస్థితుల్లో రైతులు ఒక శాతం మల్టీ కే లేదా 19: 19: 19 నీటిలో కరిగే ఎరువును ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేసినట్లయితే బెట్ట పరిస్థితులను తట్టుకుంటుందని తెలియజేశారు. అలాగే మహారాష్ట్ర కర్ణాటకలో కురిసే వర్షాలకు శ్రీశైలం సాగర్ డ్యాములకు నీరు రావడం ద్వారా ఆరుతడి పంటలకు నీరు వచ్చే అవకాశం ఉంది కాబట్టి రైతులు నిరుత్సాహపడకుండా వరికి బదులు ఆరుతడి పంట లైన కంది పెసర, మినుము, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఉన్నటువంటి నీటిని సద్వినియోగం చేసుకున్నట్లయితే ఈ ఖరీఫ్ లో మిర్చి సాగు కూడా ఆశాజనకంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి రామచంద్రరావు, వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు లామ్ ఫారం డాక్టర్ ఎన్వివిఎస్ఎస్ దుర్గాప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న) డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ సాంబశివరావు, పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీ నగేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మాచర్ల, జగదీశ్వర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి డి పాప కుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు యం మార్కండేయులు, బి చౌదర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది యం శివా నాయక్, వి మీనాబాయి, రాయవరం గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీడబ్ల్యూజేప ప్రధాన కార్యదర్శి పత్తి సురేష్ గుప్తా





**(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 6)**

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ను బ్రహ్మంగారిమఠం వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (బీడబ్ల్యూజేఏ)ప్రధాన కార్యదర్శి పత్తి సురేష్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి పలు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మైదుకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆయుష్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించేలా చొరవ చూపాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. భక్తులు, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది అవసరమని వివరించారు. అదేవిధంగా, బ్రహ్మంగారిమఠం ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ యోగ కేంద్రం ఏర్పాటు చేయాలని కూడా మంత్రికి విన్నవించారు. పత్తి సురేష్ గుప్తా ప్రస్తావించిన అన్ని అంశాలపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

### జగన్ పర్యటన కేవలం రాజకీయ బలప్రదర్శన కోసమే

### రైతులకు ప్రభుత్వం ముందస్తు ఆర్థిక భరోసా

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు




**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 6)**

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పర్యటన కేవలం రాజకీయ బలప్రదర్శన కోసమేనని, రైతుల పట్ల ప్రేమ ఉన్నట్లు ముసలి కన్నీరు కారుస్తూ సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా విమర్శించారు. జగన్ పర్యటన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన రైతు మద్దతు చర్యలను గణాంకాలతో సహా వివరించారు.

**రైతులకు ముందస్తు ఆర్థిక భరోసా**

పొగాకు రైతులను నిజంగా ఆదుకున్నది కూటమి ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ఏడాది ప్రభుత్వం మొదటిసారిగా మార్క్‌ఫెడ్ ద్వారా బార్లీ పొగాకు కొనుగోలుకు శ్రీకారం చుట్టి రూ.273 కోట్లు విడుదల చేసి రైతుల్లో ఆనందం నింపిందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసిన చరిత్ర లేదని, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ద్వారానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. 94 మిలియన్ కిలోల గ్రేడ్, మీడియం గ్రేడ్ ఎఫ్‌సీవీ పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. సుమారు 45 వేల మంది రైతులకు రూ.50 వేల చొప్పున వడ్డీలేని రుణాలను రెండంచెల గడువుతో అందిస్తున్నట్లు వివరించారు. రైతులకు మెరుగైన ధర లభించేందుకు వేలం విధానాన్ని మరో రెండు నెలలు పొడిగించామని, కనీస కొనుగోలు ధరలను బ్రైట్ గ్రేడ్‌కు రూ.230, మీడియంకు రూ.190, ఆఫ్ స్టైల్‌కు రూ.130, లో గ్రేడ్‌కు రూ.110గా ఖరారు చేసినట్లు తెలిపారు.

**కంపెనీలతో సంప్రదింపులు, సీఎం సమీక్షలు**

సంవత్సరంన్నర కాలంగా ప్రభుత్వ గోడౌన్లలో పొగాకు నిల్వలు ఉండటం, కంపెనీల వద్ద కూడా ఈ ఏడాది నిల్వలు మిగిలి ఉండటం వల్ల కొనుగోలుకు కంపెనీలు ముందుకు రావడం లేదని ఎమ్మెల్యే వివరించారు. దీనిపై ప్రభుత్వం కంపెనీలు, ట్రేడర్లతో చర్చలు జరుపుతోందని, హై, మీడియం గ్రేడులు కొనుగోలు చేసేందుకు కంపెనీలు అంగీకరించాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూహెచ్ఓ నిబంధనల ప్రకారం నేరుగా పొగాకు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లోనూ, రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి రైతులను ఆదుకుంటోందని పేర్కొన్నారు. మిరప, మొక్కజొన్న పంటలకు కూడా మంచి ధర లభించేలా కొనుగోలు సంప్రదింపులు జరిపామని, ముఖ్యమంత్రి చంద్రబాబు వారానికి ఒకరోజు మంత్రి అచ్చెన్నాయుడుతో వ్యవసాయ సమస్యలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

## కేంద్ర పట్టు మండలి వారి నా పట్టు నా అభిమానం 2.0

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 6)**

కేంద్ర పట్టు మండలి వారి నా పట్టు నా అభిమానం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి పి సుజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ మైసూరు నుంచి శాస్త్రవేత్తలు, పట్టు రైతులు, పట్టుపరిశ్రమ శాఖ సిబ్బంది, సహాయ సంచాలకులు వారి కార్యాలయం మార్కాపురం నందు సమావేశం నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కారాలు తెలియచేసారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జాయిసి రాణి, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు. నా పట్టు నా అభిమానం కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పట్టుపురుగులు పెంచడంలో వచ్చే సమస్యలను రైతుల నుంచి తెలుసుకొని వారికి కావలసినటువంటి సలహాలను, సూచనలను తెలియజేశారు. ప్రస్తుతం ఉన్నటువంటి ఈ పరిస్థితుల్లో నీటిని ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలి, డ్రిప్పు వంటి పరికరాలు ఏర్పాటు చేసుకోవలసిందిగా తెలిపినారు. పట్టుపురుగులు పెంచడం వలన ఏ విధమైన లాభాలు వస్తాయి, వాటిని ఏ విధంగా రైతులు అందుకోవాలి అనే విషయాల పైన కూడా కూలంకషంగా చర్చించి, రైతులకు వివరించడం జరిగినది . పట్టు పురుగుల పెంపకం కు కావలసినటువంటి ప్రభుత్వ సహాయం సహకారాలను వివరించడం జరిగినది. అదేవిధంగా శాస్త్రవేత డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ ఈ పంటకి ఎటువంటి భూమి కావాలి, భూమిని ఏ విధంగా తయారు చేసుకోవాలి, ఏ విధంగా ఎరువులు వేయాలి, మొక్కలు ఏ విధంగా పెంచాలి వంటి యాజమాన్య పద్ధతులు వివరించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సువార్త వివిజిరాంజీ పథకంలో మల్బరికి వచ్చు రాయితీ గురించి తెలియజేశారు. కాబట్టి రైతులు ఈ అవకాశం ఉపయోగించుకోవాల్సిందిగా పట్టు రైతులను కోరారు. కేంద్ర పట్టు మండలి వారు నిర్వహించేటటువంటి ఈ సదస్సులు సెప్టెంబర్ 22 వరకు జిల్లాలో జరుగనున్నాయని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి డాక్టర్ పి సుజై కుమార్ తెలిపారు. తదుపరి పీవీపురం, కొమరోలు, పొదలకొండపల్లి గ్రామాలలో మల్బరీ తోటలు, రేరింగ్ షెడ్లు పరిశీలించి పట్టు రైతులకు తగిన సూచనలు ఇచ్చారు. చివరగా గిద్దలూరులోని మోడల్ మల్బరీ సీడ్ ఫారంను సందర్శించి చాకీ కేంద్రం నుండి రైతులకు సరఫరా అవుతున్న చాకీ పురుగులను, మల్బరీ తోటలను మరియు నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి డాక్టర్ పి సుజై కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ జాయిసి రాణి, డాక్టర్ సౌజన్య, గిద్దలూరు సహాయ పట్టుపరిశ్రమ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.








## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 6)**

శుక్రవారం 220కేవీ కందుకూరు సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు నిమిత్తం కొత్త మన్నేటికోట, పాత మన్నేటికోట, కొత్తూరు, మన్నేటికోట హైవే పక్కన ఉన్న హోటల్స్‌కి ఆత్మకూరు, కుమ్మరిపాలెం, దాని పరిసర గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సింగరాయకొండ సబ్ డివిజన్ వారు కోరారు.

## తల్లిపాలు బిడ్డలకు అమృతం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 6)**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొలుకుల చెన్నారాయునిపల్లి గ్రామాలలో వివిధ అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత పై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు వైద్యులు, సిబ్బందితో కలిసి గ్రామాలలో అవగాహన సదస్సు ర్యాలీని నిర్వహించారు. ఏఎన్ఎం ఆబిదా ఖాతూన్ మాట్లాడుతూ.. "శిశువు పుట్టిన మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి. ఇది బిడ్డలో రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచి, వివిధ వ్యాధుల నుంచి కాపాడుతుంది" అని స్పష్టం చేశారు. శిశు వైద్య విభాగాధిపతి సమాజంలో స్తన్యపానంపై ఉన్న పలు అపోహలను తొలగించి, ప్రతి తల్లిని ప్రోత్సహించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ నారాయణమ్మ, అంజలి, మల్లీశ్వరి, సుశీల, మల్లేశ్వరి, వెంకటరత్నమ్మ, ఆశ వర్కర్ అనసూయమ్మ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద రోగులకు ఆర్థిక సాయం

### 50 మందికి 26 లక్షలు అందజేత

### ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 6)**

పేదల ఆరోగ్య భద్రతే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ హయాంలో పేద ప్రజలకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం అందలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలోనే 2,075 మంది పేదలకు రూ.18.57 కోట్లను వైద్య చికిత్సల కోసం ఆర్థిక సాయంగా అందించినట్లు వెల్లడించారు. ఈ రోజు కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు రూ.25.98 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. పేద ప్రజలకు ఇంతటి సాయం అందించడంలో గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో పాటు కార్యాలయ సిబ్బంది కూడా నిస్వార్థంగా పనిచేస్తున్నారని, ఒక్క రూపాయి కూడా అవినీతికి తావివ్వకుండా చెక్కులు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, ఆగస్టు 6)**

వెలిగండ్లలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆర్డీవోతో కలిసి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఇంద్ర భూపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


Printed by O Radhakrishna Dass On behalf of HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published from Dr.No. 4-255, PANDARIPURAM CHILAKALURIPET H/O, PURUSHOTHA PATNAM CHILAKALURIPET, GUNTUR, ANDHRA PRADESH - 522616. Mobile : 9494177939, RNI : APTEL/25/A2455, E-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం
### సూపర్వైజర్ లక్ష్మీదేవి





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 6)**

తల్లిపాలు పుట్టిన బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన వరం అని అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చెన్నారెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని అంగన్వాడి సూపర్వైజర్, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమానికి గ్రామంలోని బాలింతలు, గర్భిణీస్త్రీలు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్, లక్ష్మీదేవి మాట్లాడుతూ అప్పుడే ప్రసవించిన పసిబిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలను తాపడం మంచిదన్నారు. వాటిలో మంచి పోషకాలు, రోగనిరోధక శక్తి లభిస్తాయన్నారు. అంతేకాక గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుని ఎడల తల్లి ఆరోగ్యంతో పాటు బిడ్డ ఆరోగ్యం కూడా శ్రేయస్కరంగా ఉంటాయన్నారు. నిత్యం శిశు వుపోషణ, ఆరోగ్యం పై తల్లి ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలన్నారు. తల్లి శిశువు పై తీసుకునే జాగ్రత్తల వలన శిశువు ఆరోగ్యంగా దిన దినాభివృద్ధి చెందుతారన్నారని సూపర్వైజర్ లక్ష్మీదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## ఉలవపాడులో జోరుగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 6)**

మండల కేంద్రమైన ఉలవపాడు పంచాయతీ లోని బూత్ నెంబర్ 243, 244 ఏరియాలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం గత రెండు సంవత్సరాలుగా నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి లోకల్ నాయకులు డోర్ టు డోర్ తిరుగుతూ ప్రజల సమస్యలు, కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. స్థానిక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు కొనసాగుతామని తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డు ప్రసాద్, రాచగల్లు శివకుమార్, గంటా కృష్ణ, బి పవన్ కుమార్, బత్తిన రమేష్, బి సుబ్రహ్మణ్యం, ఎస్కె రఫీ, ఎండి కరీం, ఎస్కె ఖాదర్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాల పై మైదుకూరులో వైఎస్సార్‌సీపీ సమరభేరి

### మెగా డీఎస్సీ అక్రమాల పై సీబీఐ విచారణ జరిపించాలి
### మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లిలి రఘురామిరెడ్డి డిమాండ్




**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 6)**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మైదుకూరు నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంలో మైదుకూరు, ఖాజీపేట మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ ప్రక్రియలో తీవ్రస్థాయిలో అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పారదర్శకత లేకుండా, మెరిట్ జాబితా బయటపెట్టకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐ చేత విచారణ జరిపించాలని, నిర్వహణ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్లు, ఆరోపణలు:** గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన నాడు-నేడు, విద్యా దీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలను నిలిపివేసి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, బకాయి పడిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలలో ఇచ్చిన ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఈ నెల 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు కొనసాగుతాయని నాయకులు తెలిపారు. ఆ తర్వాత ఆగస్టు 10న మైదుకూరు పట్టణంలో భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు,పట్టణ మండల ఖాజీపేట మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నిరుద్యోగ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# టీడీపీ నాయకుడు బాల సిద్ధారెడ్డి హత్య అత్యంత విచారకరం

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్
### పార్థివదేహానికి నివాళులు
### కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది
### నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తాం

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 6)**

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాల సిద్ధారెడ్డి దారుణ హత్యకు గురికావడం పట్ల మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. వార్త తెలిసిన వెంటనే గడ్డమాయపల్లెకు చేరుకున్న ఎమ్మెల్యే బాల సిద్ధారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్టా సుధాకర్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. సిద్ధారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి వచ్చిన ఈ కష్ట సమయంలో తెలుగుదేశం పార్టీతో పాటు వ్యక్తిగతంగా తాము అన్ని వేళలా పూర్తి స్థాయిలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ఇలాంటి దారుణాలకు ఒడిగట్టే వారిని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిందితులకు కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం, ఉన్నత పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు పట్టణ, మండల టీడీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాల సిద్ధారెడ్డికి నివాళులర్పించారు.





# డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

### మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 6)**

మార్కాపురం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం దగ్గరలో డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి,అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగితే సహించబోమని పేర్కొన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించి,వచ్చిన అన్ని ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల హక్కుల కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని,వారికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటం కొనసాగిస్తామని అన్నా రాంబాబు గారు స్పష్టం చేశారు.లిఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, పట్టణ అధ్యక్షులు షేక్ సలీం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ చెంచి రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## '2 ఏళ్ల నమ్మకం'తో ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు

### ప్రభుత్వ పనితీరును ప్రజల్లో విశ్వాసం
### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 6)**

గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరాయని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్నగంజాం మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. గత రెండేళ్లలో ప్రజలకు అందించిన ఆర్థిక సహాయం, వివిధ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ షమీమ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

## మైదుకూరు లబ్ధిదారులకు రూ.52.21 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 6)**

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయ నిధిగొప్ప ఉపశమనమని మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరులోని క్యాంపు కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.52,21,810 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పై ఎమ్మెల్యే ఏలూరికి వినతిపత్రం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 6)**

మండలంలోని సోపిరాల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావుకి గ్రామ పెద్దలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నరన్నారు. గ్రామ స్మశానానికి ప్రహరీ గోడ మంజురు చెయ్యలని,గ్రామం నుండి జాతీయ రహదారి 216కు వేళ్ళే రహదారిని డబల్ రోడ్డుగా అభివృద్ధి చెయ్యలని విన్నవించారు.దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరి ష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఇ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తుమ్మలపెంట సీతయ్య,పర్వతరెడ్డి హరిబాబు, కుర్రి రామసుబ్బారావు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

నగర పంచాయతీ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 6)

పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడమే ప్రాధాన్యతగా అధికారులు పనిచేయాలని మార్కాపురం ఎమ్మెల్యే, అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆదేశించారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, పట్టణ ప్రగతిపై శాఖాపరమైన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పట్టణంలో పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనుల తీరును, స్థానికుల నుండి అందిన అర్జీలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది టీమ్‌వర్క్‌తో పనిచేస్తూ ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే వినతుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతాయుతంగా స్పందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ రామ్మోహన్‌రావు, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్, ఇతర నాయకులు, అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలే మానవాళి మనుగడకు ప్రాణాధారం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 6)

మొక్కలే మానవాళి మనుగడకు ప్రాణాధారం అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం పరిధిలోని గజ్జలకొండలో 2026-27 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన 'నెట్ జీరో ఆరోగ్యకరమైన ప్రాంగణం' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. వీబీజీ రామ్‌జీ ఉద్యానవన పెంపకం కార్యక్రమంలో భాగంగా ఈ "అతి అధిక సాంద్రతతో మొక్కల పెంపకం" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, నీటి సంరక్షణలో మొక్కల పెంపకం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచే ఈ నూతన 'అతి అధిక సాంద్రత' విధానం ద్వారా పచ్చదనాన్ని వేగంగా విస్తరించవచ్చుని పేర్కొన్నారు. "ఈ రోజు పచ్చదనం-రేపటి మెరుగైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

# మద్దిపాడు మండలంలో పాదయాత్ర చేసిన సిపిఐ నాయకులు





(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, ఆగస్టు 6)

దేశంలో రాజకీయ మార్పు రావాలి, మార్పును కోరుకోవాలి, మార్పును తీసుకురావాలి అన్న నినాదంతో దేశ వ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 15వ తేదీ వరకు పాదయాత్రలు జరపాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలిపిచ్చింది .అంతిమంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించింది. సిపిఐ ఇచ్చిన పిలుపును అనుసరించి సిపిఐ మద్దిపాడు మండల పార్టీ కార్యకర్తలు మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మండలంలో పాదయాత్ర నిర్వహించారు. ఈరోజు ఉదయం మారెళ్ళగుంటపాలెంలోని నల్లూ రి అంజయ్య స్తూపం వద్ద నుండి ప్రారంభమైన పాదయాత్ర మారెళ్ళ గుంట పాలెం, నరసాయపాలెం, అంజయ్య నగర్, పెద్దకొత్తపల్లి , దొడ్డారప్పాడు, వెంకటరాజు పాలెం మద్దిపాడు కోస్టా లు, మండల కేంద్రం అయిన మద్దిపాడులో ముగిసింది. పాదయాత్రను సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఎంసీ వెంకటేశ్వర్లు ప్రారంభిస్తూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. 2014లో అధికారానికి వచ్చిన మోడీ ప్రభుత్వం అవినీతిని సహించమని, నిరుద్యోగాన్ని పారతోలుతానని, రైతుల ఆత్మహత్యలను నిరోధిస్తానని, దళితులు మైనార్టీ వర్గాలపై దాడులను దాడులను అరికడతానని, అనేక విధాలుగా వాగ్దానాలు చేశాడు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నిటిని మర్చిపోయాడు. అవినీతిని అరికడతానన్న మోడీ తన మిత్రుడు అదాని అవినీతికి పాల్పడినట్లు అమెరికా పత్రికలు వెల్లడించిన, సర్వే సంస్థలు సాక్షాలు బయటపెట్టిన మోడీ ప్రభుత్వం ఆదానిని కాపాడింది తప్ప విచారించిన పాపాన పోలేదన్నారు. యువకులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసిన మోడీ దానిని గాలికి వదిలేయడం, ప్రతి సంవత్సరం కోటి మంది విద్యార్థులు డిగ్రీ కాగితాలు తీసుకొని బయటికి వస్తున్న కనీసం లక్ష మందికి కూడా ఉద్యోగాలు కల్పించలేని దుస్థితి మోడీ ప్రభుత్వా నిధి ఈనాటి యువతరం 15-29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి చదువుకున్న యువకులు 40 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని అనేక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అదే విధంగా మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ సమాజంలో ఉన్న ఆర్థిక అంతరాలు ఇంతకుముందు ఎన్నడూ లేవని అనేకమంది ఆర్థిక నిపుణులు తెలియజేశారు. ఈ దశబ్ద కాలంలోనే దేశంలో శతకోటీశ్వరులు 200 నుండి 350 మంది వరకు పెరిగారు. వారి ఆస్తులు విపరీతంగా పెరిగాయి. కానీ దేశంలో రైతులు ఆత్మహత్యలు మాత్రం ఆగలేదు. రైతు పంటకు గిట్టుబాటు ధర లేదు. రైతు ఆందోళన చేస్తే పోలీసులను పెట్టి అణచివేస్తున్నారు. విద్యార్థుల నీట్ పరీక్ష పత్రము లీకైతే దానిమీద విచారణ జరపాలని దానికి బాధ్యులుగా విద్యాశాఖ మంత్రి రాజీనామా ఇవ్వాలని ఢిల్లీ జంతర్ మంతర్‌లో వేలమందివిద్యార్థులు విద్యార్థులు ధర్నా చేస్తే వారిపై లాఠీ జార్జ్ చేసి వారిపై భాషా ప్రయోగించి పెల్లెట్ తూటాలను ఉపయోగించారని, పోలీసులు కర్కసంగా ప్రవర్తించారని విమర్శించారు. మద్దిపాడు బస్టాండ్ సెంటర్లో సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి నల్లూరి మురళి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాశి నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. నేడు మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహి అని,పాకిస్తాన్ ఏజెంట్ అని రకరకాల పేర్లు పెట్టి ముద్ర వేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు నీట్ పరీక్ష పత్రాలు లీక్ అయినందుకు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసినందుకు వారిని దారుణంగా, అవమానకరంగా నిందలు వేశారని చెప్పారు. అదే విధంగా మన రాష్ట్రంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక కొనే దిక్కు లేక అల్లాడుతుంటే మోడీ ప్రభుత్వం గాని ఇక్కడ ఉన్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గాని ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. రైతుకు రక్షణగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిధులు కేటాయించి రైతులు ఇబ్బందులు వచ్చినప్పుడు వారిని ఆదుకోవాలని ఎంతో కాలంగా రైతు సంఘాలు కమ్యూనిస్టు పార్టీ కోరుతున్న పాలకులు పెడచెవిని పెడుతున్నారని అన్నారు. కాబట్టి కమ్యూనిస్టు పార్టీ దేశ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను వివరించి వారిని చైతన్యం చేసేందుకు ఈ పాదయాత్రలు చేపట్టామని మాకు మీ సహాయ సహకారాలు కావాలని నల్లూరి మురళి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు పావులూరు అంజయ్య, రాష్ట్ర కౌలు రైతు సంఘ నాయకుడు టీవీ శేషయ్య, జిల్లా డిహెచ్పిఎస్ కార్యదర్శి ముత్తన అంజయ్య, జిల్లా సిపిఐ సీనియర్ నాయకుడు ఉప్పుటూరు ప్రకాష్‌రావు, సిపిఐ స్థానిక నాయకులు అంగలకుర్తి వెంకటరావు, నల్లమోతు హనుమంతరావు, గోగినేనిరావు, ఎఐటిసి నాయకులు ఎద్దు రమేష్, ఒంగోలు పట్టణ సిపిఐ కార్యదర్శి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# చుండూరు మాలల రక్త తర్పణమే ఎస్సీ ఎస్టీ యాక్ట్

## దళిత క్రైస్తవుల రిజర్వేషన్ పై తీర్పు సంవత్సరంలో ఇచ్చిన సుప్రీంకోర్టు చుండూరు మారణకాండ పై 35 ఏళ్ళైనా ఎందుకు ఇవ్వలేదు?

## చుండూరులో మృతవీరుల స్మారక స్తూపం త్వరలో నిర్మిస్తాం

## దళిత నేత నీలం నాగేంద్ర

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

చుండూరు మాలముర్త వీరుల రక్తతర్పణమే భారత దేశ దళితులకు వజ్రాయుధమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్రావు చుండూరులో చుండూరు మృతవీరులకు నివాళులర్పించారు. గురువారం చుండూరులో చుండూరు దళిత మృతవీరుల 35వ స్మారక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరు మాలపల్లి పై ఆనాటి కాంగ్రెస్ పార్టీ రెడ్లు పోలీసు బలగాల సాయంతో చుట్టుముట్టి 9 మంది మాలలను ఊచకోత కోశారన్నారు. దళితుల శవాలను తుంగభద్ర నదిలో వేయగా కాంగ్రెస్ ప్రభుత్వం శవాలను తీయటానికి నాలుగు రోజులు కాలయాపన చేశారన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి జనార్దన్ రెడ్డి చండూరు దళిత ఉద్యమంపై రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ నిర్బంధ కాండ ప్రయోగించి విశ్వవిద్యాలయాల విద్యార్థులపై కూడా లాఠీ చార్జ్ చేయించారన్నారు. చుండూరు నిరసన శిబిరంలో పల్లెవీరుడు పల్లె వీరుడు అనిల్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ పోలీసులు కాల్చి చంపారన్నారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించగా గత్యంతరం లేక చుండూరు బాధితులు ఢిల్లీ వెళ్లి న్యాయం కోసం ఉద్యమించారన్నారు. చుండూరు ఉద్యమంతోనే దళితుడైన కె.ఆర్ నారాయణన్ దేశానికి తొలి దళిత రాష్ట్రపతి అయ్యాడన్నారు. చుండూరు మాలల రక్తధారలే దేశంలో దళితులు అనుభవిస్తున్న ఎస్సీ ఎస్టీ యాక్టివ్ చట్టానికి కారణం అన్నారు. చుండూరు మాలల మారణకాండ పై చుండూరు ప్రత్యేక కోర్టులో శిక్షలు పడగా హైకోర్టులో జస్టిస్ నరసింహారెడ్డి చుండూరు హంతకులందరూ నిర్దోషిలేనని మనువాద తీర్పు ఇచ్చాడన్నారు. చుండూరు అగ్రకుల హంతకులకు శిక్షలు వేయాలని సుప్రీంకోర్టులో చుండూరు బాధితుల పోరాట కమిటీ న్యాయపోరాటం చేస్తుందన్నారు. దళిత క్రైస్తవుల కు ఎస్సీ హోదాపై బాపట్ల జిల్లాకు చెందిన చింతాడ ఆనంద్ కేసులో దళితులకు వ్యతిరేకంగా సంవత్సరంలోపే తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు చుండూరు మాలల నర మేధంపై 35 సంవత్సరాలు అయినా ఫైల్ కదలకపోవటం మనువాదమేనన్నారు. సుప్రీంకోర్టులో చుండూరు దళిత నరమేధంపై న్యాయపోరాటానికి త్వరలోనే ఢిల్లీ వెళ్లి న్యాయాన్నిపుణుల బృందంతో చర్చిస్తామన్నారు. అలాగే అగ్రకుల నివాసాల మధ్య ఖననం చేసిన చుండూరు దళితుల సమాధు స్థానం "రక్త క్షేత్రంలో" ఆరు నెలల్లో చుండూరు మృతవీరుల స్మారక స్తూపం నిర్మిస్తామని నీలం నాగేందర్రావు ప్రకటించారు. ముస్లింలకు మక్కా, హిందువులకు కాశి, క్రైస్తవులకు జెరూసలేం కాగా దళితులకు కారణంచేడు రుదిర క్షేత్రం, చుండూరు రక్తక్షేత్రం అని దళిత నాయకులు మేళం భాగ్య రావు, ఎన్ జే విద్యాసాగర్, కే ఎన్ పి ఎస్ కృష్ణ, ఉప్పులేటి దేవి ప్రసాద్, చుండూరు బాధితుల కమిటీ జాలాది మోజెస్, పి. వి.రావు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, నివాళులర్పించారు.





# యూకే ఏపిఎన్ఆర్‌టి కోఆర్డినేటర్‌గా లింగా రవితేజ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 6)

మండలంలోని కరవది గ్రామానికి చెందిన లింగా రవితేజను ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపి ఎన్ఆర్‌టి) యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ సందర్భంగా కోవెంట్రీ తెలుగుదేశంపార్టీ తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు లింగా రవితేజకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారత్‌తో పాటు యునైటెడ్ కింగ్‌డమ్‌లో పార్టీ కార్యకలాపాల కోసం ఆయన చేసిన కృషి, అంకితభావం, నిరంతర సేవలకు గుర్తింపుగానే ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథంతో ఈ గౌరవప్రదమైన బాధ్యతలను అందుకున్న లింగా రవితేజ కొత్త పదవిలో విజయవంతంగా రాణించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.